SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



సంపుటి: 19 | సంచిక: 95 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 27 జనవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |






# భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత

## తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌తో పెరిగిన ఇమేజ్

- సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయింపు
- 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ
- ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందచేత
- గణతంత్ర దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**హైదరాబాద్, జనవరి 26:** భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని గవర్నర్ ఎగరవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని, దీంతో హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచుతుందని చెప్పారు.

మిగతా 2 లో

## మూడు ఎకనమిక్ జోన్లుగా రాష్ట్ర విభజన



## గవర్నర్ ఎట్ హోం

**హైదరాబాద్,జనవరి 26 :** రిపబ్లిక్ డే సందర్భంగా లోక్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమం జరిగింది. నేతలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీజే ఏకే సింగ్, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కాంగ్రెస్, బీఆర్ఎస్, భాజపా నేతలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్స్‌లెన్స్‌ను జిష్ణుదేవ్ వర్మ ప్రదానం చేశారు. ఎట్ హోం సందర్భంగా రాజ్‌భన్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

# అంబరాన్నంటిన గణతంత్ర వేడుకులు

జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ



## ఆకట్టుకున్న సైనిక శకట ప్రదర్శన

- ఆకర్షణగా ఆపరేషన్ సిందూర్ ఆయుధ వ్యవస్థలు
- ముఖ్య అతిథులుగా ఆంటోనియో కోస్టా, ఉర్సులా వాన్‌డెర్ లేయెన్

దేశ రాజధాని ఢిల్లీలో గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం 10.30 గంటలకు కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరిం చారు. అనంతరం సైనిక దళాల కవాతు ప్రారంభమైంది. అపాచీతో పాటు ప్రచండ్ తేలికపాటి హెలికాప్టర్ల విన్యాసా లు ఆకట్టుకు న్నాయి. పోరులో ధరించే దుస్తుల తో అశ్విక దళం తొలిసారి ఈ పరేడ్‌లో పాల్గొం ది. ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక విభాగం కూ డా ప్రదర్శనలిచ్చింది. దేశ అభివృద్ధి ప్రస్థానం, సాంస్కృతిక వైవిధ్యం, సైనిక బలం, ఆపరేషన్ సిందూర్‌లో వాడిన ప్రధాన ఆయుధ వ్యవస్థలు వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడు కలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

వివరాలు 4వ పేజీలో



# పదివేల కిలోల పేలుడు పదార్థాలు

- రాజస్థాన్‌లో పట్టుకున్న అధికారులు 4



# కర్రెగుట్టల్లో పేలిన మందు పాతరలు

- పదిమంది భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలు




.. వివరాలు 2లో

# ‘రాక్షస పాలన’

- రేవంత్ రెడ్డి పాలనలో నడుస్తున్నది ‘అనుముల రాజ్యాంగం’
- కాంగ్రెస్ ‘న్యాయ పత్రం’ కాదు.. ‘అన్యాయ పత్రం’ 3
- హెచ్‌సీయూ భూముల్లో రూ.10 వేల కోట్ల కుంభకోణం
- గణతంత్ర వేడుకల్లో ప్రభుత్వంపై కేటీఆర్ ఘాటు విమర్శలు





## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

# స్వర్ణాంధ్ర 2047

**అమరావతి, జనవరి 26:** స్వర్ణాంధ్ర– 2047 లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ వెల్లడించారు. 10 సూత్రాల ఆధారంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. సోమవారం రాజధాని అమరావతిలో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. జీరో పావర్టీ, ఎన్టీఆర్ భరోసా ద్వారా పెన్షన్ అందించి పేదలకు అండగా ఏపీ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు.

మిగతా 5 లో

- 10 సూత్రాల ఆధారంగా కూటమి ప్రభుత్వం అడుగులు
- సాంకేతికత పాలన కొత్త పుంతలు
- ప్రజలకు మరింతం చేరువగా ప్రభుత్వ సేవలు
- సామాజి పెన్షన్లు, 3 సిటిండర్లతో పేదలకు అండ
- 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం దృష్టి 2
- అమరావతి గణతంత్ర వేడుకల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్

## విషమంగా కానిస్టేబుల్ సౌమ్య

# ఆరోగ్య పరిస్థితి

- నిజామాబాద్ దాడి ఘటన దారుణం
- ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను పరామర్శించిన దామోదర
- దాడికి కారకులను వదిలిపెట్టేది లేదన్న మంత్రి



.. వివరాలు 2లో

# నకిలీ హెచ్‌టీ పత్తివిత్తనాలు



పది టన్నుల విత్తనాలు స్వాధీనం 2

# ఉద్యోగులపై పని భారం తగ్గించండి

- సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం 5



## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో

# పరిణామం



బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్‌కు సిట్ నోటీసులు 2



## కర్రెగుట్టల్లో పేలిన మందుపాతరలు

**పదిమంది భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలు**

**ములుగు, జనవరి 26:** తెలంగాణ సరిహద్దులో ఉన్న కర్రెగుట్టల్లో మావోయిస్టులు అమర్చిన ఐఈడీలు పేలి 10 మంది భద్రతా సిబ్బంది గాయపడ్డారు. కర్రెగుట్టల్లో మావోయిస్టుల కదలిక, ఐఈడీలు అమర్చినట్లు భద్రతా సంస్థలకు విశ్వసనీయ సమాచారం అందడంతో కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అనేక ఐఈడీలు ఒకదాని తర్వాత ఒకటి పేలాయి. దీంతో జవాన్లు గాయపడ్డారు. వారిని ఆర్మీ హెలికాప్టర్‌లో రాయ్‌పుర్‌కు తరలించారు. వీరిలో 9 మంది డీఆర్‌జీ, మరొకరు కోబ్రా బెటాలియన్‌కు చెందినవారు. గాయపడిన భద్రతా సిబ్బందికి ప్రాణాపాయం తప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో కర్రెగుట్టల్లో హైఅలర్ట్ ప్రకటించి కూంబింగ్ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. గతేడాది ఇదే ప్రాంతంలో 21 రోజుల పాటు దేశంలోనే అతిపెద్ద మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ నిర్వహించిన విషయం తెలిసిందే.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో పరిణామం

**బీఆర్‌ఎస్ మాజీ ఎంఎంపీ సంతోష్‌కు సిట్ నోటీసులు**



**హైదరాబాద్, జనవరి 26:** సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు తాజాగా బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ రావుకు నోటీసులు జారీ చేశారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా, ఈ వ్యవహారానికి సంబంధించిన కొన్ని కీలక వాస్తవాలు సంతోష్ రావుకు తెలిసి ఉండవచ్చని భావిస్తున్నట్లు పోలీసులు నోటీసులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, విచారణ నిమిత్తం జనవరి 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జుబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో స్వయంగా హాజరు కావాలని జుబ్లీహిల్స్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. వెంకటగిరి ఆదేశించారు. ఇప్పటికే ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులను విచారించిన సంగతి తెలిసిందే. ఐటీ చట్టం, ప్రభుత్వ ఆస్తుల నష్టం నిరోధక చట్టం వంటి కఠిన సెక్షన్ల కింద కొనసాగుతున్న ఈ విచారణలో సంతోష్ రావుకు నోటీసులు అందడం రాజకీయ వర్గాల్లో పెను కలకలం రేపుతోంది. రేపు మధ్యాహ్నం జరగబోయే ఈ విచారణలో సిట్ అధికారులు సంతోష్ రావు నుండి ఎటువంటి సమాచారాన్ని రాబడతారనే అంశంపై ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

## నకిలీ హెచ్‌టీ పత్తివిత్తనాలు

**పది టన్నుల విత్తనాలు స్వాధీనం**



**నారాయణపేట, జనవరి 26 :** జిల్లాలో రైతులను మోసం చేస్తూ నకిలీ హెచ్‌టీ పత్తి విత్తనాలను అక్రమంగా విక్రయిస్తున్న వారిపై నారాయణపేట జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. సోమవారం నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆదివారం సాయంత్రం నారాయణపేట మండలం బండగొండ గ్రామం, కొత్తపల్లి మండలం భూనీడ్ గ్రామాలలో జిల్లా పోలీసు , టాస్క్ ఫోర్స్ ప్రత్యేక పోలీసు బృందం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించిందని పేర్కొన్నారు. ఈ దాడుల్లో సుమారు రూ. కోటి విలువైన 10 టన్నుల నకిలీ హెచ్.టీ పత్తి విత్తనాలను స్వాధీనం చేస్తుకున్నట్లు వెల్లడించారు. కొత్తపల్లి మండలం భూనీడ్ గ్రామానికి చెందిన వి. బాలకృష్ణ నాయుడు, శశివర్ధన్ నాయుడు అనే తండ్రి, కొడుకుల ఇళ్ల నుంచి వీటిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు, మద్దూరు పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదు చేశామని ఎస్పీ తెలిపారు. బాలకృష్ణ నాయుడు గతంలో మద్దూరు, నర్వ, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. ఆ కేసులన్నీ ప్రస్తుతం కోర్టుల్లో విచారణలో ఉన్నాయని తెలిపారు. రైతులను మోసం చేసే నకిలీ విత్తనాల వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ప్యాకింగ్ లేని , అనుమానాస్పద విత్తనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. నకిలీ విత్తనాల వ్యాపారం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు , వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు సుమారు మూడు మండలాల్లో పంటలు వేయడానికి సరిపడే పరిమాణంలో ఉన్నాయని వివరించారు. గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ షాపులలోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని, లాట్ నెంబర్ ఉన్న విత్తనాలనే కొనాలని రైతులకు సూచించారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన ప్రత్యేక పోలీసు బృందం, వ్యవసాయ శాఖ అధికారులను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అభినందించారు.

# భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రాన్ని మూడు ఎకనమిక్ జోన్లుగా విభజించి, కీలక రంగాలకు ప్రత్యేకమైన జోన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయించినట్లు గవర్నర్ వెల్లడించారు. రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, గతేడాది బతుకమ్మ వేడుకలు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాయని ఆయన పేర్కొన్నారు. 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు, ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందజేశామని గవర్నర్ తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని గర్వంగా చెప్పారు. భూ వివాదాలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం తీసుకొచ్చామని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గ్రూప్-1, 2, 3 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని, ఇప్పటివరకు 62 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఆయన తెలిపారు. ఐటిఐలను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చి, తెలంగాణను గ్లోబల్ స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని గవర్నర్



పేర్కొన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని గవర్నర్ తెలిపారు. బ్యాంకుల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామని, మహిళలను పెట్రోల్ బంక్‌లు, ఆర్టీసీ అ÷-దదె బస్సులకు ఓనర్లుగా చేశామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటికే 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారని వెల్లడించారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం.. 27 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టిందని గవర్నర్ తెలిపారు. తెలంగాణలో 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో 3.35 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని, చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, హిల్ట్ పాలసీతో కాలుష్య పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తామని గవర్నర్ వెల్లడించారు. రిపబ్లిక్ డే వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు. అమెరికా పర్యటనలో ఉండటంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరుకాలేదు. సీఎం రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ ప్రజలకు సోషల్ మీడియా ద్వారా సందేశమిచ్చారు. రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం ఆమోదించబడిన ఈ రోజును భారతదేశ చరిత్రలో ముఖ్యమైన సందర్భంగా సీఎం అభివర్ణించారు.

# మేడారంలో అంతర్జాతీయ ఆదివాసీ మేళా

- గద్దెలపై న్యూజిలాండ్ 'హాకా' నృత్యం
- జాతరను సందర్శించిన మావోరి తెగ ప్రతినిధులు
- కళాకారులతో కలిసి నృత్యం చేసిన సీతక్క



**ములుగు,జనవరి 26 :** ప్రపంచ ప్రఖ్యాత శ్రీ సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా సోమవారం న్యూజిలాండ్‌కు చెందిన మావోరి తెగ ప్రతినిధులు మేడారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మేడారం గద్దెల ప్రాంగణంలో మావోరి తెగ వారి సంప్రదాయ నృత్యమైన 'హాకా' నృత్యాన్ని వారు ప్రదర్శించారు. హాకా నృత్యం అనేది మావోరి తెగలో యుద్ధానికి సిద్ధమయ్యే సమయంలో తమ సైనికుల్లో ఉత్సాహం నింపేందుకు, శత్రువుల్లో భయాన్ని కలిగించే విధంగా చేసే సంప్రదాయ నృత్యంగా ప్రసిద్ధి చెందింది. ఈ నృత్యంలో ముఖభావాలు, శరీర చలనలు అత్యంత ప్రభావవంతంగా ఉంటాయి. తెలంగాణ?న్యూజిలాండ్ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమంలో భాగంగా పంచాయతీ రాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మావోరి తెగ ప్రతినిధులు మేడారం మహాజాతరను సందర్శించారు. హాకా నృత్య ప్రదర్శన సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా కళాకారులతో కలిసి నృత్యం చేసి వారి ఉత్సాహాన్ని పెంచారు. సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీ సంస్కృతికి దేశ సరిహద్దులు, భాషలు అడ్డుకావని, ప్రపంచంలోని ఎక్కడైనా ఆదివాసీలు అడవి, ప్రకృతి మీదే ఆధారపడి జీవనం సాగిస్తారని అన్నారు. ఆదివాసీ జీవన విధానం, విశ్వాసాలు ప్రపంచవ్యాప్తంగా ఒకే తత్వాన్ని ప్రతిబింబిస్తాయని ఆమె పేర్కొన్నారు. అనంతరం మావోరి తెగ ప్రతినిధులను గద్దల వద్దకు తీసుకెళ్లి వన దేవతల దర్శనం చేయించారు. సమ్మక్క?సారలమ్మ వన దేవతల వైభవం, చరిత్రను మంత్రి సీతక్క స్వయంగా వారికి వివరించారు. ఈ సందర్భంగా బంగారం, వన దేవతల ప్రసాదాన్ని అందజేసి మావోరి తెగ ప్రతినిధులను సన్మానించారు.

# విషమంగా కానిస్టేబుల్ సౌమ్య ఆరోగ్య పరిస్థితి

**నిజామాబాద్ దాడి ఘటన దారుణం**

**కానిస్టేబుల్‌ను పరామర్శించిన దామోదర**

**దాడికి కారకులను వదిలిపెట్టేది లేదన్న మంత్రి**



**హైదరాబాద్, జనవరి 26:** నిజామాబాద్‌లో గంజాయి స్మగ్లర్ల దాడిలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను, ఆమె కుటుంబ సభ్యులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం పరామర్శించారు. సౌమ్యపై దాడి దురదృష్టకరమని మంత్రి విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఎక్సైజ్, పోలీస్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు మంత్రి. క్రమంలోనే నిజామాబాద్‌లో జరిగిన ఘటన అత్యంత దురదృష్టకరమని రాజ నర్సింహ అన్నారు. ఇందులు కారకులైన ప్రతి ఒక్కరినీ చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. సౌమ్య ఆరోగ్య పరిస్థితి నిన్నటి కంటే మెరుగైనప్పటికీ.. ఇంకా ఆమె కండీషన్ క్రిటికల్‌గానే ఉందని తెలిపారు. నిమ్స్‌లో సుశిక్షితులైన సీనియర్ వైద్యుల బృందం, సౌమ్యకు అత్యాధునిక వసతులతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. సౌమ్య సంపూర్ణంగా కోలుకుటుందని ఆశిస్తున్నామన్నారు. ఆమె కుటుంబాన్ని అన్నిరకాలుగా ఆదుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు. విధి నిర్వాహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. నిందితులపై ఇప్పటికే హత్యాయత్నం కేసు నమోదు చేయించామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. నిమ్స్‌లో సౌమ్యను పరామర్శించిన మంత్రికి ఆమె ఆరోగ్య పరిస్థితిని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, వైద్యులు వివరించారు.

# మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**హుస్నాబాద్‌లో జెండా ఊపి ప్రారంభించిన మంత్రి పొన్నాం**



**సిద్దిపేట,జనవరి26:** తెలంగాణ కుంభమేళాగా పిలవబడే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బస్ స్టేషన్‌లో మేడారం స్పెషల్ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం తీసుకుంటున్న పలు కీలక నిర్ణయాలను ఆయన వెల్లడించారు. జాతరకు వెళ్లే భక్తులకు ఎక్కడా రవాణా ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4000 ఆర్టీసీ బస్సులను కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఒక్క హుస్నాబాద్ డిపో నుండే మేడారానికి 50ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని, ఎవరూ ఇబ్బంది పడకుండా గమ్యస్థానాలకు చేరుకోవాలని మంత్రి సూచించారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం అత్యంత సురక్షితమైనదని, ప్రైవేట్ వాహనాల కంటే ఆర్టీసీ బస్సులకు ఒక ప్రత్యేక సౌకర్యం ఉందని మంత్రి వివరించారు. భక్తులు నడక సాగించే అవసరం లేకుండా, నేరుగా అమ్మవార్ల గద్దెల వరకు వెళ్లగలిగే రవాణా సౌకర్యం కేవలం ప్రభుత్వ బస్సులకే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేట్ వాహనాలలో రద్దీ , ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు ప్రజలు ఆర్టీసీని ఎంచుకోవాలని కోరారు. జాతరలో లక్షలాది మంది భక్తులు పాల్గొనే క్రమంలో చిన్న పిల్లలు తప్పిపోయే ప్రమాదం ఉంటుంది. దీనిని నివారించేందుకు పోలీస్ శాఖ , ఆర్టీసీ సంయుక్తంగా ఒక వినూత్న చర్య చేపట్టాయి. జాతరకు వచ్చే ప్రతి చిన్న బిడ్డ చేతికి పేరు , తల్లిదండ్రుల ఫోన్ నంబర్ నమోదు చేసిన ఒక ప్రత్యేక బ్యాండ్‌ను కడతారు. ఒకవేళ రద్దీలో పిల్లలు తప్పిపోయినా, ఈ బ్యాండ్ ఆధారంగా వారిని వెంటనే తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి వీలవుతుంది. ఈ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు. హుస్నాబాద్ నుండి ప్రారంభమైన ఈ బస్సు సర్వీసులు జాతర ముగిసే వరకు నిరంతరాయంగా అందుబాటులో ఉంటాయని, పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు.

# రాష్ట్రంలో 'రాక్షస పాలన'

- రేవంత్ రెడ్డి పాలనలో నడుస్తున్నది 'అనుముల రాజ్యాంగం'
- కాంగ్రెస్ 'న్యాయ పత్రం' కాదు.. 'అన్యాయ పత్రం'
- హెచ్‌సీయూ భూముల్లో రూ.10 వేల కోట్ల కుంభకోణం
- గణతంత్ర వేడుకల్లో ప్రభుత్వంపై కేటీఆర్ ఘాటు విమర్శలు



**హైదరాబాద్, జనవరి 26 :** దేశవ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుగుతుంటే, తెలంగాణలో మాత్రం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ 'రాక్షస పాలన' సాగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) మండిపడ్డారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఆయన, అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణలో ప్రస్తుతం రాజ్యాంగబద్ధమైన ప్రజా పాలన కనుమరుగైందని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే 'రాక్షస పాలన' కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థులు రాష్ట్రంలో జరుగుతున్న రాజ్యాంగ ఉల్లంఘనలపై ప్రదర్శించిన లఘు నాటిక అందరినీ ఆలోచింపజేసిందని కేటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఆయన మీడియాను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరిపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. తుక్కుగూడలో విడుదల చేసిన 'న్యాయ పత్రం'లో పార్టీ ఫిరాయింపులను ఖండించామని చెబుతూనే, అదే వేదికపై బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన నేతలను కూర్చోబెట్టుకోవడం కాంగ్రెస్ నాటకానికి నిదర్శనమన్నారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో, కాంగ్రెస్ న్యాయ పత్రంలో న్యాయం అంతే ఉందని ఎద్దేవా చేస్తూ, దానిని 'అన్యాయ పత్రం'గా పిలవాలన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి "జెండా గద్దెలను కూల్చేయండి" అని పిలుపునివ్వడం రాజ్యాంగ విలువలకు పూర్తిగా విరుద్ధమని విమర్శించారు.

### లాకప్ డెత్‌ల ప్రభుత్వం

దళితులు, గిరిజనులు, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కోదాడలో దళిత యువకుడు కర్రా రాజేష్ పోలీస్ కస్టడీలో మృతి చెందిన ఘటనకు 60రోజులు గడిచినా సీఎం రేవంత్ రెడ్డి గానీ, స్థానిక మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గానీ స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిస్టులను ఉగ్రవాదుల్లా అరెస్ట్ చేయడం రాజ్యాంగ హననమేనని వ్యాఖ్యానించారు. లగచర్లలో గిరిజన ఆడబిడ్డల ఇళ్లలోకి చొరబడి దౌర్జన్యాలు, రైతులను జైళ్లకు పంపడం, హైడ్రాఉమూసి పేరుతో పేదల ఇళ్ల కూల్చివేతలు ఈ ప్రభుత్వ రాక్షస పాలనకు నిదర్శనమన్నారు.

### అంబేద్కర్ మాటలు గుర్తు చేసిన కేటీఆర్

డాక్టర్‌బీఆర్‌అంబేద్కర్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "రాజ్యాంగం ఎంత గొప్పదైనా, దాన్ని అమలు చేసే వారిలో చిత్తశుద్ధి లేకపోతే అది వ్యర్థమే" అన్న మాటలు నేడు అక్షరాలా నిజమవుతున్నాయని అన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పోటీ పడి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనలో ప్రజా పాలన మాయమై 'అనుముల రాజ్యాంగం' నడుస్తోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అంశంపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. 400 ఎకరాల యూనివర్సిటీ భూమిని కాపాడేందుకు విద్యార్థులు చేస్తున్న పోరాటాన్ని అభినందించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఈ భూములను చెరబట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు గ్రీన్ బెంచ్ నియమించిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సీఈసీ) క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిందని, ఈ కుంభకోణం విలువ దాదాపు రూ.10 వేల కోట్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇంతటి భారీ అవినీతిపై రాహుల్ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు.

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధృతరాష్ట్ర పాత్ర

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధృతరాష్ట్ర పాత్ర పోషిస్తున్నారని కేటీఆర్ అన్నారు. మహాభారతంలో ధృతరాష్ట్రుడికి ఏమీ కనిపించనట్లు.. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సభాపతి అలానే వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో చేవెళ్ల నియోజకవర్గంలోని పలువురు బీజేపీ నేతలు.. బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కేటీఆర్. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు న్యాయం జరగాలంటే కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నారు. రెండోసారి మోసపోతే.. మనం తప్పు చేసిన వాళ్లమవుతామని చెప్పారు. ఈసారి కేసీఆర్ సీఎం అయితే తెలంగాణలో మిగిలిన సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చేవెళ్లలో కాలె యాదయ్యను తన మనిషి అనుకుని కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ గెలిపించిన కొన్ని రోజులకే.. ఆయన కాంగ్రెస్ గూటికి వెళ్లాడంటూ మండిపడ్డారు. యాదయ్య పార్టీ మారినట్లు ఆధారాలున్నాయని.. ఆయనపై వేటు వేయాలని స్పీకర్‌ను కోరామన్నారు.

# స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర లేని బీజేపీ

- ఉపాధిలో గాంధీ పేరును తొలగించారు
- ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కిన ఘనత
- గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరణలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, జనవరి 26:** స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనని పెద్దలు 2014 నుంచి అధికారంలోకి వచ్చారని, వారు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మర్శించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ పేరును తొలగించాలని మన్రేగా పథకాన్ని రద్దు చేస్తున్నారని.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ చిత్రాలు కనిపిస్తాయని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. 2014 వరకు యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నారని, లౌకికవాదానికి తూట్లు పొడుస్తున్నారని, కులాలు- మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని మహేష్ గౌడ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఆర్థిక విధ్వంసం జరిగిందని... సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కుల సర్వేతో యావత్ రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని తెలిపారు. బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కులగణన బిల్లులను బీజేపీ అడ్డుకుంటోందని, బీజేపీ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని టీపీసీసీ చీఫ్ కోరారు. మహాత్ముడి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య పోరాటం విజయవంతమైందని, ప్రపంచం గర్వించదగ్గ రాజ్యాంగాన్ని అంబేద్కర్ రాశారన్నారు. మహాత్మా గాంధీ కలలు నెరవేర్చే దూరదృష్టి ఉన్న వ్యక్తి నెహ్రూ అని ప్రశంసించారు. ఐరన్ లేడీ ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ దేశానికి గట్టి పునాదులు వేశారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డాక్టర్ అజారుద్దీన్, షబ్బీర్ అలీ సహా వీహెచ్, దానం నాగేందర్, సంపత్, కోదండరాం, బెల్లయ్య నాయక్, చిన్నారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని కాలరాసిన ఇందిర గాంధీ

## అదేబాటలో కాంగ్రెస్ పాలకులు

### బీజేపీ కార్యాలయంలో జెండా ఎగరేసిన రామ్

**హైదరాబాద్, జనవరి 26:** రాజ్యాంగంలో కల్పించిన మౌలిక హక్కులను మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కాలరాశారని.. ఇందిరా, రాజీవ్ గాంధీ బాటలోనే రాహుల్ గాంధీ నడుస్తున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. భారతీయులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని... ఇతర దేశాలకు చెందిన వారికి ఓటు హక్కు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చాలా మంది రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేశారని... నెహ్రూ రాజ్యాంగాన్ని పక్కకు పెట్టారని విమర్శించారు.





మొదటిసారి రాజ్యాంగాన్ని అవమానించింది నెహ్రూ అని... అంబేద్కర్‌ను అవమానించారని ఆరోపించారు. అంబేద్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌ది అంటూ విరుచుకుపడ్డారు.సీఐఆర్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. గ్రామీణ ఉపాధి పథకంలో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. పేదలకు మేలు చేయాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని తెలంగాణ బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ 60 ఏళ్లపాటు దేశాన్ని దోచుకుందని.. పేదలకు మేలు చేసే పథకాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని రాష్ట్ర బీజేపీ చీఫ్ విమర్శించారు. రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. అంబేద్కర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం భారతరత్న ఇవ్వలేదని గుర్తుచేశారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని గౌరవించింది మోదీ ప్రభుత్వమని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రైతులకు ఏమీ చేయలేదని, ప్రధాని కిసాన్ యోజన ద్వారా రైతులకు మోదీ మేలు చేస్తున్నారని పేర్కొన్నారు. మజ్లిస్‌తో కలిసి కాంగ్రెస్ పని చేస్తోందని... కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు అవినీతి పార్టీలంటూ వ్యాఖ్యలు చేశారు. రెండు పార్టీలను తరిమికొట్టి బీజేపీని ఆదరించాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఎంపీ లక్ష్మణ్ సహా పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.



# జాతీయ జెండాకు అవమానం

### తలకిందులుగా జెండా ఆవిష్కరణ

**మెదక్, జనవరి 26:** మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో జాతీయ జెండా అవమానానికి గురైన ఘటన కలకలం రేపింది. స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల సందర్భంగా ఆర్డీవో మహిపాల్ రెడ్డి జాతీయ జెండాను తలక్రిందులుగా ఆవిష్కరించడం వివాదానికి దారితీసింది. జెండా ఆవిష్కరణ అనంతరం అక్కడ ఉన్న స్థానికులు ఈ విషయాన్ని గమనించి అధికారులకు సూచించారు. దీంతో అప్రమత్తమైన ఆర్డీవో వెంటనే జెండాను సరిచేసి రెండోసారి సక్రమంగా ఎగరవేశారు. అయితే అప్పటికే ఈ ఘటనపై విమర్శలు మొదలయ్యాయి. జాతీయ జెండా ఆవిష్కరణ వంటి కార్యక్రమంలో ఈ తరహా నిర్లక్ష్యం ఎలా జరిగిందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయంలోనే ఇలాంటి తప్పిదం జరగడం బాధాకరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# అక్రిడిటేషన్ జీవో సవరణ

**హైదరాబాద్, జనవరి 26:** ప్రభుత్వం జారీచేసిన అక్రిడిటేషన్ల జీవోపై జర్నలిస్టుల నుంచి ఆందోళన వ్యక్తం కావడంతో ప్రభుత్వం దిద్దుబాటుకు పూనుకుంది. డెస్క్ జర్నలిస్టులకు సైతం అక్రిడిటేషన్ కార్డులే జారీ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణ జీవో నెంబర్ 103 పై తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం హర్షం వ్యక్తం చేసింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ మాట్లాడుతూ గతంలో తీసుకువచ్చిన 252 జీవో పై టీయూడబ్ల్యూజే చేసిన పోరాట ఫలితంగా జర్నలిస్టు సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసిందన్నారు. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవరణ జీవో తేవడం, అందులో ప్రధానంగా అందరి జర్నలిస్టుల మాదిరిగానే డెస్క్ జర్నలిస్ట్ సైతం అక్రిడిటేషన్ కార్డులే జారీచేస్తామని చేస్తున్నారని స్పష్టం చేయడం ముదావహం అన్నారు. మండల స్థాయిలో లక్షన్నరకు పైగా జనాభా ఉన్నచోట అదనపు కార్డులు ఇస్తామని పేర్కొనడంతోపాటు కల్చరల్, స్పోర్ట్స్, సినిమా జర్నలిస్టులకు సైతం ప్రత్యేకంగా కార్డులు జారీ చేస్తానని ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జీవో మారడం టీయూడబ్ల్యూజే సాధించిన విజయమని పేర్కొన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో వచ్చిన 239 జీవో ప్రకారం వచ్చినన్ని అక్రిడేషన్ కార్డులు ఈ సవరణ జీవో అనంతరం కూడా ఆ స్థాయిలో రావడంలేదని విషయం తేటతెల్లమైందన్నారు.

# చైనా మాంజాకు బాలిక బలి

**హైదరాబాద్, జనవరి 26:** కూకట్‌పల్లిలో నిషేధిత చైనా మాంజా ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. సంగారెడ్డి జిల్లా కాజీపల్లికి చెందిన తండ్రి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి బైక్‌పై కూకట్‌పల్లికి వస్తుండగా, వివేకానందనగర్ జాతీయ రహదారి వద్ద గాలిపటం చైనా మాంజా ఐదేళ్ల చిన్నారి నిష్విక ఆదిత్య మెడకు బలంగా చుట్టుకుంది. ఒక్కసారిగా చిన్నారి కేకలు వేయడంతో తండ్రి బైక్ ఆపి చూసేసరికి, మాంజా కోసుకుపోవడంతో మెడ భాగం నుంచి తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంటనే బాధితుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కళ్ల ముందే కూతురు ప్రాణాలు కోల్పోవడంతో ఆ తండ్రి రోదనలు మిన్నంటాయి. ఈ హృదయ విదారక ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిషేధం ఉన్నప్పటికీ చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై దర్యాప్తు ప్రారంభించారు. ప్రభుత్వ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఇలాంటి ప్రమాదకర దారాలను వాడటం వల్ల సామాన్యుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# జూబ్లీహిల్స్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

### జూబ్లీహిల్స్‌లో సర్యటించిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జనవరి 26:** నగరంలోని జూబ్లీహిల్స్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఈ నియోజకవర్గం నుంచి చదువుకున్న యువకుడిని నిలబెట్టి ప్రజలే గెలిపించారని పేర్కొన్నారు. రాజకీయాలు వ్యవస్థలో చాలా ముఖ్యమైనవని, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అన్ని రోడ్డు పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం జూబ్లీహిల్స్‌లో పర్యటించిన ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు ప్రజలకు సేవ చేయాలనే తపన ఉందని, అలాంటి నాయకుడితో కలిసి అభివృద్ధి పనులు చేయించుకోవాలని ప్రజలకు మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. భవిష్యత్తులో నవీన్ యాదవ్ పెద్ద స్థాయి నాయకుడిగా ఎదుగుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ అంటే చాలా అభివృద్ధి చెందిన ప్రాంతమని అనుకున్నప్పటికీ, ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. హైదరాబాద్ నగరంలో కాలుష్యం తీవ్రంగా పెరిగిందని, పరిశ్రమలను నగరానికి దూరంగా ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందని వెల్లడించారు. అలాగే కమలాపురి కాలనీలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణ సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు .

# సభాపతిని ధృతరాష్ట్రుడ్రితో పోల్చడం ఏమిటి?

### తోణం కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి: అద్దంకి

**హైదరాబాద్, జనవరి 26:** గణతంత్ర దినోత్సవం రోజున రాజ్యాంగాన్ని, రాజ్యాంగబద్ధ హోదాలో ఉన్న స్పీకర్‌ను అవమానించినందుకు కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అద్దంకి దయాకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'సభాపతిని ధృతరాష్ట్రుడ్రితో పోల్చడం ఏమిటి? సభ్యుడిగా మీకు సంస్కారముందా? ముఖ్యమంత్రిని అవమానించడం మీది ఏ రాజనీతి? మీ నాయన కేసీఆర్ రాజ్యాంగంతో తెలంగాణ వచ్చిందని చెబుతూ అవమానిస్తున్నారు. రాజ్యాంగ వ్యతిరేకులుగా మారి, రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నట్లు నాటకాలు వేస్తున్నారు, నాటకాలు ఆడిస్తున్నారు' అని ఎమ్మెల్సీ విమర్శించారు. 'మీరు, పది మంది గురించి మాట్లాడుతున్నారు.. కానీ 39 మందిని మీ పార్టీలో చేర్చుకున్న మిమ్మల్ని ఏమనాలి? మీరు చేసిన రాజ్యాంగ ద్రోహాన్ని ప్రజలు మననం చేసుకుంటున్నారు. ఫస్ట్రేషన్‌తో చేస్తున్న మీ నాటకాలను ప్రజలు తిరస్కరించారు. మీరు ప్రతిపక్ష నాయకులుగా ఉండటం దురదృష్టకరం. ఇప్పటికైనా మీరు చేసిన తప్పును గమనించి క్షమాపణ చెబితే మంచిది' అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.




సంపాదకీయం

# విచారణలో కాలయాపనలు దేనికోసం?

ప్రభుత్వాలు నడుపుతున్న వ్యక్తులకు , పార్టీలకు జవాబుదారీతనం లేకుండా పోయింది. సవాళ్లు, ప్రతిసవాళ్ల తో సమస్యలను పక్కదారి పట్టించేస్తున్నారు. ప్రధానంగా ఇది తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. సమస్యలను, అవినీతిపై పరస్పర విమర్శలు చేసుకుంటూ ఇది వారి వ్యక్తిగత వ్యవహారంగా ప్రచారం చేసుకునే రీతిలో ప్రవర్తిస్తున్నారు. ఏపీలో టిడిపి, వైసిపి, తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పరిస్థితి ఇలాగే ఉంది. పరస్పర విమర్శలతో ప్రజలను మభ్య పెటట్టం ద్వారా ఈ పార్టీలు పబ్బం గడుపుకునే పరిస్థితి దాపురించింది. నిజానికి ఈ వ్యవహారంపై అంటే అవినీతి ఆరోపణలపై కేంద్రం ప్రేక్షకపాత్ర వహిస్తోంది. బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై రెండేళ్లు దాటినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. విచారణల తోనే కాలం గడిచింది. కేంద్ర ప్రభుత్వ టెలిగ్రాఫిక్ చట్టం ప్రకారం ఫోన్ ట్యాపింగ్ తీవ్ర నేరంగా పరిగణించాలి. బిఆర్ఎస్ పాలనా కాలంలో చాలా మంది ఫోన్ సంభాషణలను రికార్డు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వ్యక్తిగత గోప్యతను హరించివేశారు. వాటి ఆధారాలను తుడిచిపెట్టారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు తాము కూడా బాధితులమే అని చెప్పుకొంటున్నారంటే ఏ స్థాయిలో టెలిఫోన్ ట్యాపింగ్ దుర్వినియోగమయిందో అర్థం చేసుకోవచ్చు. ఇందుకు కవిత పదేపదే ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుత దర్యాప్తుతో సత్వర న్యాయం కాదుకదా, అసలు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని అంటున్నారు. ప్రతిపక్షాలతోపాటు జర్నలిస్టులు, ఇతర ప్రముఖుల సంభాషణలు విని వారి కదలికలను తెలుసుకోవడం ద్వారా కేసీఆర్ వారిని కట్టడికి యత్నించారు. అధికారాన్ని కూడా నిలుపుకోవడానికి ఈ నీచయత్నానికి పాల్పడ్డారు. ఎలక్టోరల్ బాండ్స్ పొందడం కోసం టెలిఫోన్ ట్యాపింగ్‌ను సాధనంగా వాడుకున్నట్లు బయటపడింది. కెటిఆర్ విచారణలో ఇదే ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. ఈ వ్యవహారంపై రెండేళ్లుగా విచారణ జరుగుతోంది. ఇంకెంత కాలం విచారణ జరుపుతారన్నది తెలియదు. సుప్రీంకోర్టు కూడా ఇటీవల ఒక సందర్భంలో ఇంకెంతకాలం అన్న విసయాన్ని ప్రస్తావించింది. టెలిఫోన్ ట్యాపింగ్‌పై అవసరమైన ఆధారాలు ఇప్పటికే ప్రభుత్వానికి లభించాయి. కావాలనుకుంటే ఇప్పటికిప్పుడు చర్యలు తీసుకోవచ్చు. అయినా విచారణను సాగదీస్తున్నారు. బహుశా కేసీఆర్, సంతోష్‌రావును కూడా త్వరలో విచారణకు పిలవవచ్చని అంటున్నారు. విచారణ ఎంత ఎక్కువ కాలం సాగితేస్తే అంతగా లబ్ది పొందాలని ప్రభుత్వం చూస్తున్నదా అన్నది కూడా తెలియాల్సి ఉంది. ఇదే అదనుగా ట్యాపింగ్ విచారణకు హాజరైన హరీశ్‌రావు, కేటీఆర్‌లు ప్రభుత్వంపై ఎదురుదాడి మొదలెట్టారు. వేధింపుల కోసం, ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఈ విచారణలను కనసాగిస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే వీలైనంత త్వరగా ముగించడం, దోషలును శిక్షలకు గురి చేయడం అవసరం. గతంలో జరిగిన తప్పులపై చర్యలు తీసుకొనే విధంగా విచారణ సాగాలి. త్వరగా ముగించాలి. అలాకాకపోతే ఇదంతా అధికార విపక్షాల మధ్య నడిచే డ్రామాగా పరిగణించాల్సి ఉంటుంది. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికే విమర్శలు చేయడం మొదలెట్టారు. అతీగతీ లేకుండా విచారణలు సాగుతూ ముఖ్య నాయకులను విచారణల పేరిట పిలుస్తూ పోవడంవల్ల ప్రజలు సహజంగానే వారి విమర్శలను విశ్వసిస్తారు. టెలిఫోన్ ట్యాపింగ్ విచారణ సాగినంత కాలం బీఆర్ఎస్ నాయకులు సింగరేణి వంటి విషయాల్లో ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూనే ఉంటారు. ప్రస్తుతానికి టెలిఫోన్ ట్యాపింగ్ విషయమే హాట్ టాపిక్ అయింది. త్వరలో మరో వివాదం తెరపైకి రావొచ్చు. అప్పుడు ఇది కూడా తెర మరుగవుతుంది. ప్రభుత్వాలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి ఎంతో సమయం పట్టదు. అది సింగరేణి విషయమైనా, టెలిఫోన్ ట్యాపింగ్ విషయమైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. ప్రభుత్వాలు బలంగా కోరుకున్న సందర్భాలలో విచారణలు వేగంగా పూర్తవుతాయి. శిక్షలు కూడా అంతే వేగంగా పడతాయి. రాజకీయ క్రీడలో భాగమైనప్పుడు మాత్రమే విచారణలు సాగుతూనే ఉంటాయి. ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతూనే ఉంటాయి. ఎదురుదాడి వ్యూహాలు పదునెక్కుతాయి. ఇక సింగరేణిపై అటు కేంద్రం.. ఇటు రాష్ట్ర ప్రభుత్వం విషం చిమ్ముతున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని నిబంధనలు పెడుతూ ఆ సంస్థను నిర్వీర్యం చేయడంతో పాటు ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే రెండు బొగ్గు గనులను కేంద్రం వేలం ద్వారా అమ్మి ప్రైవేట్‌కు ద్వారాలు తెరువగా.. ఇప్పుడు రేవంత్ సర్కార్ కూడా అదేబాటలో నడుస్తున్నది. ఓవర్ బర్డెన్ పనులకు 'సైట్ విజిట్' నిబంధనను ముందుగా తెచ్చి, ఆ తర్వాత నైని బొగ్గు బ్లాక్‌లో ఏకంగా బొగ్గు ఉత్పత్తి ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు భట్టి తదితరలుఉ రంగంలోకి దిగారని అంటున్నారు. సింగరేణి చేతిలో ఉండాల్సిన ఈ గనిని 25 ఏండ్ల పాటు ప్రైవేట్ కంపెనీల చేతుల్లో పెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. అంటే పేరు మాత్రమే సింగరేణిది, గనిపై పూర్తి అధికారాలు ప్రైవేట్ సంస్థకే ఉంటాయని అర్థం చేసుకోవాలి. ఇలా స్వరాష్ట్రంలో సిరులు కురిపించిన సింగరేణి.. కేంద్ర, రాష్ట్ర పాలకుల నిర్ణయాలతో తన అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉన్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇటీవల చేర్చిన నిబంధనలు, పరిణామాలను నిశితంగా గమనిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం కనిపిస్తున్నది. సంస్థలో ఇప్పటివరకు ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గుపై కప్పబడి ఉండే ఓబీ పనులు మాత్రమే ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్నారు. అయితే కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఇక నుంచి ఓబీతో పాటు బొగ్గు వెలికితీత పనులు ప్రైవేట్ వ్యక్తుల చేతికి వెళ్లనున్నాయి. సింగరేణికి ఎంతో ప్రతిష్టాత్మకమైన ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాక్‌లో కొత్తగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎండీవో పేరిట టెండర్లను పిలువడంతో ఇక నుంచి ఈ బ్లాక్‌లో అన్ని పనులు ప్రైవేట్ వ్యక్తులే చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందువల్ల విచారణలో పారదర్శకత ఉండాలి. ట్యాపింగ్ కావచ్చు. సింగరేణి కావచ్చు నిజాలు చెప్పినప్పుడే ప్రజల్లో నిలబడతారు. లేకుంటే కనుమురుగ అవుతారు. పాలకులు విచారణల పేరుతో కాలయాపన చేయకుండా నిజాలు నిగ్గుతేల్చాల్సి ఉంది.

# అంబరాన్నింటిన గణతంత్ర వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము
- ఆకట్టుకున్న సైనిక శకట ప్రదర్శన
- ప్రత్యేక ఆకర్షణగా ఆపరేషన్ సిందూర్ ఆయుధ వ్యవస్థలు
- ముఖ్య అతిథులుగా ఆంటోనియో కోస్టా, ఉర్సులా వాన్‌డెర్ లేయెన్





**న్యూఢిల్లీ,జనవరి 26:** దేశ రాజధాని దిల్లీలో గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం 10.30 గంటలకు కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సైనిక దళాల కవాతు ప్రారంభమైంది. అపాచీతో పాటు ప్రచండ్ తేలికపాటి హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోరులో ధరించే దుస్తులతో అశ్వికదళం తొలిసారి ఈ పరేడ్‌లో పాల్గొంది. ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక విభాగం కూడా ప్రదర్శనలిచ్చింది. దేశ అభివృద్ధి ప్రస్థానం, సాంస్కృతిక వైవిధ్యం, సైనిక బలం, ఆపరేషన్ సిందూర్‌లో వాడిన ప్రధాన ఆయుధ వ్యవస్థలు వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ వేడుకలను వీక్షించేందుకు వేలాది మంది విచ్చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నిర్వహించిన పరేడ్ భారత సైనిక శక్తి పాటవాన్ని సగర్వంగా చాటిచెప్పింది. ఆపరేషన్ సిందూర్‌లో వాడిన పలు ఆయుధ వ్యవస్థలను సైనిక దళాలు కర్తవ్యపథ్ వేదికగా అచ్చెరువొందేలా ప్రదర్శించాయి. ఈ కవాతులో తొలిసారిగా బ్యాటిల్ అరే ఫార్మేషన్‌లో నిర్వహించిన కవాతు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. యుద్ధ క్షేత్రంలో సైన్యాల మోహరింపును పోలినట్టు పరేడ్ నిర్వహించడం అతిథులు ఆశ్చర్యపోయేలా చేసింది. ఈ పరేడ్‌లో త్రివిధ దళాలకు చెందిన 6,050 సైనికులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ థీమ్‌తో సాగిన ఆయుధ ప్రదర్శన భారత సైనిక పాటవాన్ని జగద్విదితం చేసింది. ఈ వేడుకల సందర్భంగా నాలుగు ఎమ్ఐ-17 హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకగా నిలిచిన ఆకాశ్ ఆయుధ వ్యవస్థ, బ్రహ్మోస్ క్షిపణి ప్రదర్శన, 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగలిగే సూర్యాస్త్ర రాకెట్ లాంఛర్ అతిథులను ఆకట్టుకున్నాయి. అర్జున్ యుద్ధ ట్యాంకు ప్రదర్శన కూడా ప్రత్యేక అట్రాక్షన్‌గా నిలిచింది. భారత్‌కు అత్యంత కీలకంగా మారిన ఎస్-400 క్షిపణి నిరోధక వ్యవస్థను కూడా ప్రదర్శించారు. అపాచీ, ప్రచండ్ హెలికాప్టర్లు, వివిధ యుద్ధ విమానాల గగనతల విన్యాసాలు మెప్పించాయి. డ్రోన్ ప్రదర్శన కూడా పరేడ్‌లో జనాలను అమితంగా ఆకట్టుకుంది. ఈ కవాతులో కొత్తగా ఏర్పడిన భైరవ్ లైట్ కమాండో బెటాలియన్ కూడా మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సైనిక కవాతుతో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలు, కళా ప్రదర్శనలు దేశ సాంస్కృతిక వైవిధ్యతను చాటాయి. కేంద్ర ప్రభుత్వ విభాగాలకు చెందిన 30 శకటాలు దేశ ఖ్యాతిని ఇనుడింపచేశాయి. ఈ వేడుకల్లో దేశం నలుమూలల నుంచి సుమారు 10 వేల మంది అతిథులు పరేడ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు.





# పదివేల కిలోల పేలుడు పదార్థాల స్వాధీనం

## రాజస్థాన్‌లో పట్టుకున్న అధికారులు





**జయపుర, జనవరి 26:** రిపబ్లిక్ డే వేళ ఇంటెలిజెన్స్ అధికారులు స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను ఛేదించారు. నిఘా వర్గాల సమాచారం మేరకు గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు రాజస్థాన్‌లో 10వేల కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. నాగౌర్ జిల్లాలోని ఓ ఫామ్‌హౌస్‌లో స్మగ్లింగ్ నెట్‌వర్క్ పని చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఫామ్‌హౌస్‌పై దాడి చేయగా.. 187 బస్తాల అమ్మోనియం నైట్రేట్‌తో పాటు డిటోనేటర్లు, డిటోనేటర్ వైర్లు, ఇతర పేలుడు పదార్థాలు లభ్యమైనట్లు తెలిపారు. వీటిని అక్రమ మైనింగ్‌లో వాడుతున్నట్లు అనుమానం వ్యక్తంచేశారు. సులేమాన్‌ఖాన్ అనే వ్యక్తి అరెస్ట్ చేసి, విచారణ చేపట్టామన్నారు. ప్పటివరకు ఈ పేలుడు పదార్థాలను ఎవరెవరికి సరఫరా చేశారు. ఇందులో ఇతర రాష్ట్రాల ముఠాలకు సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు నిందితుడు పేలుడు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు తెలిపారు. వీటి విలువ రూ.కోట్లలో ఉంటుందన్నారు. నిందితుడిపై గతంలోనూ పేలుడు పదార్థాల సరఫరాకు సంబంధించి పలు కేసులు నమోదయ్యాయన్నారు.

# ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభకాంక్షలు

## ముర్ము, మోడీల సందేశం



**న్యూఢిల్లీ, జనవరి 26:** భారత 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో దేశ ప్రజలకు సందేశమిచ్చారు. 'మీ అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మీ జీవితం.. ఆనందం, శాంతి, భద్రత, సామరస్యంతో నిండి ఉంటుందని నేను గట్టిగా నమ్ముతున్నాను' అని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు.గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో ఒక సందేశం పోస్ట్ చేశారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా వికసిత్ భారత్‌ను నిర్మించాలనే మన సమష్టి సంకల్పంలో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని అందించాలని ఆకాంక్షించారు మోదీ. గణతంత్ర దినోత్సవం మన స్వేచ్ఛ, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలకు శక్తిమంతమైన చిహ్నమని ప్రధాని తెలిపారు. ఈ పండుగ దేశాన్ని కలిసి నిర్మించాలనే సంకల్పంతో ముందుకు సాగడానికి మనకు కొత్త శక్తిని, ప్రేరణను ఇస్తుందన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మన దేశవాసులందరికీ అనేకానేక శుభాకాంక్షలు. భారతదేశ గర్వం, కీర్తికి ప్రతీక అయిన ఈ జాతీయ పండుగ.. మీ అందరి జీవితాల్లో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని నింపాలి. అభివృద్ధి చెందిన భారతదేశం కోసం సంకల్పం మరింత బలపడాలి' అని ఎక్స్ వేదికగా ప్రధాని పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం ఎంతో స్ఫూర్తిదాయకమైనదని మోదీ అన్నారు. ఆమె ప్రసంగం ప్రతి పౌరుడు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, రాజ్యాంగ విలువలను రక్షించడానికి, ఇంకా అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడానికి వారి నిబద్ధతను బలోపేతం చేయడానికి ప్రేరేపిస్తుందన్నారు.

# అమెరికాలో కూలిన విమానం

## రన్‌వేపై తలకిందులైన ప్రైవేటు జెట్

**వాషింగ్టన్, జనవరి 26:** అమెరికాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. 8 మందితో వెళుతున్న ప్రైవేటు జెట్ ఈశాన్య రాష్ట్రమైన మైనేలోని బాంగోర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కుప్పకూలిపోయింది. ప్రమాదం జరగగానే మంటలు ఎగిసిపడటంతో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఆదివారం సాయంత్రం 7 గంటల 45 నిముషాలకు మైనేలోని బాంగోర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అవుతుండగా బాంబార్డియర్ ఛాలెంజర్ 600 విమానం కూలిపోయింది. ప్రమాద సమయంలో విమానంలో 8 మంది ఉన్నారు. ప్రమాదం జరగగానే ఎమర్జెన్సీ ప్రకటించారు. వెంటనే రన్ వేను మూసేశారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని, ప్రయాణికుల జాడ గురించి ఇంకా తెలియలేదని అధికారులు తెలిపారు. విమానం హోస్టన్ కు చెందిన ఒక కంపెనీపై రిజిస్టర్ అయినట్లుగా సమాచారం. ప్రస్తుతం ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విమానాశ్రయంలో శిథిలాల నుంచి పొగలు పైకి లేస్తున్నాయి.





# అమరావతిలో వేడుకలు అభినందనీయం

**రాజ్యాంగస్ఫూర్తితో ఏపీలో అభివృద్ధి ■ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**అమరావతి, జనవరి 26:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో తొలిసారి గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటు పలువురు మంత్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. 'అమరావతిలో తొలిసారి గణతంత్ర వేడుకలు అద్భుతంగా జరిగాయి. రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధి జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతిలో తొలిసారి నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం ఆనందాన్నిచ్చింది. ఈ కార్యక్రమం భవిష్యత్తు లక్ష్యాలకు అద్దంపట్టింది. నేలపాడు ప్రాంతంలోని పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకలో పాల్గొన్న 22 శకటాలు రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబించాయి' అని పేర్కొన్నారు. పవన్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'సీఎం చంద్రబాబు నాయకత్వంలో అమరావతి నగరం సకల సౌకర్యాలతో విశ్వనగరంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను. గణతంత్ర దినోత్సవ వేదిక నుంచి గౌరవ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తుకు మార్గనిర్దేశర చేసింది. భారత రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్తామని తెలియజేస్తున్నా. రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. కూటమి ప్రభుత్వం వేసే ప్రతి అడుగు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా.. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఉంటుందని మాటిస్తున్నాము' అని పవన్ అన్నారు.

# అమరావతిలో తొలిసారిగా జెండా వందనం

**ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైదానంలో పరేడ్**

**అమరావతి, జనవరి 26:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలిసారిగా 77వ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఎగరవేశారు. హైకోర్టు సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైదానంలో ఈ వేడుకలు నిర్వహించారు. రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితోపాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ స్వీకరించారు. ఏడాది వేడుకల్లో 22 అలంకృత శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వందేమాతరం, పది సూత్రాల మిషన్, అటవీ శాఖ, ఇరిగేషన్ శాఖ, పాఠశాల విద్య, వ్యవసాయ శాఖ, సీఆర్‌డీఏ తదితర విభాగాల శకటాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో రూపొందించిన శకటాలను ప్రదర్శించారు. ఈ వేడుకలకు అమరావతి రైతులు, స్థానికులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్లు జాతీయ పతాకాన్ని ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# విజయవాడ లోక్‌భవన్‌లో ఎట్‌హోం

**అతిథులను ఆహ్వానించిన గవర్నర్**

**చంద్రబాబు, పవన్ కళ్యాణం దంపతులతో హాజరు**



**విజయవాడ, జనవరి 26:** రిపబ్లిక్ డే సందర్భంగా ఏపీ లోక్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమం జరిగింది. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అతిథులకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, సవిత, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్జీలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు నేతలు రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ లోక్ భవన్‌లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఏర్పాటు చేసిన ఎట్ హోమ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. సీఎం చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి హాజరుకాగా.. పవన్ కళ్యాణ్‌తో పాటు ఆయన సతీమణి అన్నా కొణెదల కూడా ఈ తేనీటి విందులో పాల్గొన్నారు. ఇక, ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, రాజకీయ నేతలు పాల్గొన్నారు. టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్.. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే. ఈశ్వరయ్య.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్.. శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ సహా తదితరులు హాజరయ్యారు. అతిథులతో మమేకమై గవర్నర్ అబ్దుల్ నజీర్ అభివాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ ప్రాముఖ్యతపై నేతలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు.



# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం స్వర్ణాంధ్ర 2047

మొదటి పేజీ తరువాయి





ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతికత పాలన కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. సేవలను వేగవంతంగా, జీవనాన్ని సులభంగా, పరిపాలనను మరింత తెలివైనదిగా మార్చుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి కార్యక్రమం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం ఒక్కటే.. సేవల అందించడం మెరుగుపరచడం, ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తుందన్నారు. దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 ఎల్పీజీ సిలెండర్లను ప్రభుత్వం అందిస్తోందని వివరించారు. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని స్త్రీ శక్తి పథకం ద్వారా అందిస్తోందని చెప్పారు. రూ.978 కోట్ల నిధులను ప్రధానమంత్రి స్వనిధి కోసం ఖర్చు చేశామని పేర్కొన్నారు. పది సూత్రాలు అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని వివరించారు. ఇక ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో సామాజిక పెన్షన్లు అత్యంత కీలకమైనవని అభివర్ణించారు. ప్రతి నెలా 63 లక్షల మందికిపైగా ప్రజలకు సామాజిక పెన్షన్లు అందిస్తున్నట్లు గుర్తు చేశారు గవర్నర్. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందన్నారు. అలాగే పాపులేషన్ మేనేజ్‌మెంట్‌పై ఈ ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. నీటి భద్రత ప్రభుత్వ విధామని చెప్పారు. పోలవరంతో సహా అన్ని ప్రాజెక్టులు పూర్తి చేయడంపై ప్రభుత్వం ఇప్పటికే దృష్టి కేంద్రీకరించిందని చెప్పారు. పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌పై ఇతర రాష్ట్రాలకు ఇబ్బంది కలగకుండా ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. రైతుల కోసం ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. అందుకోసం పొలం పిలుస్తోంది, రైతన్న మీా కోసం, తదితర కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ వివరించారు. నేటి గణతంత్ర వేడుక చరిత్రాత్మకమని అభివర్ణించారు. తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రజల రాజధాని అమరావతిలో జాతీయ జెండాను ఎగురవేస్తున్నామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మన రాష్ట్రానికి స్పష్టమైన దిశ లేకుండా నిలిచిపోయిందని పేర్కొన్నారు. దాంతో రాజధాని నిర్మాణం సైతం ఆగిపోయిందని గుర్తు చేశారు. ఆర్థిక విశ్వాసం దెబ్బతిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలే ? ప్రగతికి నిజమైన శిల్పులని అభివర్ణించారు. ప్రభుత్వ ప్రతి చర్య, ప్రతి సంస్కరణ, ప్రతి సమీక్ష ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతూ వృద్ధిని పునరుద్ధరించడానికే ఉద్దేశించబడిందని స్పష్టం చేశారు. ఈ ప్రయాణం సులభం కాదు.. దీనికి క్రమశిక్షణ, సహనశక్తి, సామూహిక లక్ష్యంపై అపారమైన విశ్వాసం అవసరమయ్యాయన్నారు. ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని.. సంస్థలు తిరిగి బలపడుతున్నాయని.. ప్రజల విశ్వాసం మళ్లీ స్థాపితమవుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. పునరుద్ధరణ మార్పు ప్రయాణం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. ఈ దిశను మరింత స్పష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు.. ఈ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 కార్యాచరణను ఒక స్పష్టమైన దృష్టిలో స్థిరపరిచిందని చెప్పారు. భారత స్వాతంత్ర్య శతాబ్ది నాటికి, బలమైన, సమగ్ర, ప్రపంచ స్థాయిలో పోటీతత్వం గల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా సుపరిపాలనకు పది సూత్రాలు.. పేదరికం లేని సమాజం, యువగళం, జనాభా నిర్వహణ – మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, ఆగ్రి టెక్, మౌలిక సదుపాయాలు, ఇంధనం, బ్రాండ్ ఏపీ, స్వచ్ఛంధ్ర, స్మార్ట్ గవర్నెన్స్ లక్ష్యాలను జస్టిస్ అబ్దుల్ వివరించారు. ఈ పది మార్గదర్శక సూత్రాల ఆధారంగా సాధించిన పురోగతిని, రాష్ట్ర దిశను, గమ్యాన్ని నిర్వచిస్తున్న విజయాలను ప్రజల ముందుంచడం గర్వకారణమని గవర్నర్ అభివర్ణించారు. అతి త్వరలోనే భారతదేశంలో తొలి క్వాంటం కంప్యూటర్‌ను అమరావతి క్వాంటం వ్యాలీలో ఏర్పాటు చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. శ్రీహరికోట పరిసర ప్రాంతాల్లో స్పేస్ సిటీ ఏర్పాటు ద్వారా అంతరిక్ష సాంకేతిక స్టార్టప్‌లు, తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను ఆవిష్కరణల అగ్రగామి కేంద్రంగా నిలబెడుతున్నామన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కృత్రిమ మేధ , బ్లాక్ చెయిన్ సాంకేతికతలను సమన్వయం చేస్తూ, పాలనలో పారదర్శకతను సామర్థ్యాన్ని మరింత పెంచుతోందని తెలిపారు. ఆరోగ్య రంగంలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణ కోసం ఏఐ ఆధారిత వైద్య నిర్ధారణ సేవలను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. వాట్సాప్‌లోనే 119 ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. సర్టిఫికెట్లు పొందడం, సంక్షేమ పథకాల స్థితిని తెలుసుకోవడం, ఫిర్యాదులు నమోదు చేయటం తదితర అంశాలు ఇప్పుడు క్షణాల్లో సాధ్యమవుతున్నాయన్నారు. ఇప్పుడు పాలన ఒక మెసేజ్ దూరంలోనే ఉందని చమత్కరించారు. భారతదేశంలోనే డ్రోన్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఎదుగుతోందని చెప్పారు. కర్నూలులో 300 ఎకరాల విస్తీర్ణంలో డ్రోన్ సిటీ నిర్మాణం జరుగుతోందన్నారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమాలు.. ఏపీని దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టే దిశగా సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగులపై పని భారం తగ్గించండి

**పాలనలో టెక్నాలజీని ఉపయోగించండి**

**2026 టెక్నాలజీ డ్రివెన్ డిసిషన్ మేకింగ్ ఇయర్‌గా మారాలి**

**ప్రభుత్వ సేవల్లోనూ ఏఐ పాత్ర పెరగాలి**

**సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం**

**ఆర్టీజీఎస్‌పై వివిధ శాఖల అధికారులతో సమీక్ష**



**అమరావతి, జనవరి 26:** సాంకేతికత అంటే కేవలం సౌకర్యం కాదు.. అది పారదర్శకమైన, వేగవంతమైన పాలనకు ఒక శక్తివంతమైన ఆయుధం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన పాలనా యంత్రాంగానికి సరికొత్త దిశానిర్దేశం చేశారు. 2026 సంవత్సరాన్ని 'టెక్నాలజీ డ్రివెన్ డిసిషన్ మేకింగ్ ఇయర్' (సాంకేతిక ఆధారిత నిర్ణయాల సంవత్సరం) గా ప్రకటించిన ముఖ్యమంత్రి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా అనలిటిక్స్ ద్వారా ప్రభుత్వ సేవలను సామాన్యుడి ముంగిట ఉంచడమే లక్ష్యమని వెల్లడించారు. ప్రభుత్వ సేవల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్రను పెంచాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏఐని సమర్థంగా వినియోగించడం ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను మానవ ప్రమేయం లేకుండా, అత్యంత వేగంగా మరియు కచ్చితత్వంతో పరిష్కరించవచ్చని ఆయన తెలిపారు. పనితీరులో లోపాలున్న ఉద్యోగులకు అధునాతన శిక్షణ ఇచ్చి, నిరంతర పర్యవేక్షణ ద్వారా వారిని టెక్నాలజీ వైపు మళ్లించాలని సూచించారు.

**డేటా ఆధారిత పాలన.. శాఖల మధ్య సమన్వయం**

కేవలం ఫైళ్లు కదపడం మాత్రమే కాకుండా, గణాంకాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. వైద్యం, వ్యవసాయం, రెవెన్యూ, రహదారులు, ఆర్టీఏ మరియు అగ్నిమాపక శాఖల పనితీరును సమీక్షించిన ఆయన.. శాఖల మధ్య డేటా అనుసంధానం జరగాలని కోరారు. డేటా లేక్ వ్యవస్థ ద్వారా సమాచారాన్ని విశ్లేషించి, ఎక్కడ లోపాలు ఉన్నాయో గుర్తించి సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు.

**వాట్సాప్ గవర్నెన్స్**

పాలనను ప్రజల వేలికొనలపైకి తెచ్చిన 'మన మిత్ర – వాట్సప్ గవర్నెన్స్' అద్భుత ఫలితాలను ఇస్తోందని అధికారులు వివరించారు. ఇప్పటివరకు 1.43 కోట్ల మంది పౌరులు వాట్సప్ ద్వారా ప్రభుత్వ సేవలను పొందాగా... ప్రస్తుతం ఈ ప్లాట్‌ఫారమ్ ద్వారా 878 రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయి. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల నుంచి మున్సిపల్ పన్నుల చెల్లింపు వరకు అన్నీ వాట్సప్‌లోనే పూర్తవుతున్నాయి. 2026 నాటికి ప్రతి పౌరుడికీ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా డిజిటల్ సేవలు అందించడమే ధ్యేయంగా పనిచేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

# అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగం

**రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్**



**అమరావతి, జనవరి 26:** భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులను, న్యాయం, స్వేచ్ఛను అందించిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. సోదర భావంతో ఐక్యతను చాటుదాం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి పాటుపడదాం' అని పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా.. రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. 'దేశభక్తి స్ఫూర్తి, జాతీయ గర్వంతో నిండిన గణతంత్ర దినోత్సవం మన అద్భుతమైన చరిత్రను గుర్తు చేస్తుంది. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలు ఎల్లప్పుడూ మనల్ని నడిపిస్తాయన్నారు. స్వేచ్ఛను ఆస్వాదిద్దామని.. కానీ దాని కోసం చేసిన త్యాగాలను ఎప్పటికీ మర్చిపోవద్దని ఆయన సూచించారు. గణతంత్ర దినోత్సవ స్ఫూర్తితో వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని, నవ భారతావనిలో భాగస్వామ్యం కావాలని మంత్రి దుర్గేశ్ పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు రాజ్యాంగ విలువలను కాపాడాలని, ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని ఆయన ఆకాంక్షించారు. 'మన దేశం మన గర్వం. భారత రాజ్యాంగం మనకు ప్రసాదించిన హక్కులను కాపాడుతూ, గౌరవిస్తూ బాధ్యత గల పౌరులుగా మెలగాలి. మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ.. శాంతి, సౌభాగ్యాల భారతావని కోసం మనమంతా పునరంకితమవుదాం. గణతంత్ర భారతాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు అహర్నిశలు కృషి చేద్దాం' అని మంత్రి పిలుపునిచ్చారు.



# సీసాలతో దాడి చేసి యువకుడి హత్య

**విశాఖపట్టణం, జనవరి 26 :** విశాఖ నగరంలోని మేఘాద్రిగడ్డ వద్ద ఓ యువకుడిని దుండగులు దారుణహత్య చేశారు. యువకుడి ముఖంపై మద్యం సీసాలతో దాడి చేసి దారుణంగా చంపారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ఆదివారం రాత్రి మేఘాద్రి గడ్డ వద్ద కొందరు పార్టీ చేసుకున్నట్లు గుర్తించారు. మఅతుడిని గుంటూరుకు చెందిన కల్యాణ్ చక్రవర్తిగా నిర్ధారించారు. పాతకక్షలతోనే హత్య జరిగినట్లు తెలుసుకున్నారు. ఇద్దరు అనుమానితులు మనోజ్, వినోద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# టీజీపీఎస్సీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్ జనవరి26( సమయం న్యూస్). :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ గౌరవ చైర్మన్ శ్రీ బుర్ర వెంకటేశం, ఐఏఎస్ గారు గార్డ్ ఆఫ్ ఆనర్ స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు శ్రీ అమీర్ ఉల్లా ఖాన్, ప్రొఫెసర్ నర్రీ యాదయ్య, శ్రీ లక్ష్మీకాంత్ రాథోడ్, కార్యదర్శి శ్రీమతి ఎం. హరిత, ఐఏఎస్, అలాగే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సభను ఉద్దేశించి చైర్మన్ మాట్లాడుతూ, టీజీపీఎస్సీ ఒక రాజ్యాంగ సంస్థగా ప్రజల విశ్వాసానికి తగిన విధంగా అత్యంత బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో కొన్ని నియామక ప్రక్రియలు సంవత్సరాల పాటు సాగినప్పటికీ, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అన్ని నియామకాలను పూర్తి చేసినట్లు తెలిపారు. 2026 నుంచి అన్ని నియామకాలను నిర్ధిష్ట కాలపరిమితిలో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఒక దశ పరీక్షలు మూడు నెలల్లో, బహుళ దశ పరీక్షలు ఆరు నెలల్లో పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. టీజీపీఎస్సీకి 2026 సంవత్సరం సంస్కరణలు, కొత్త కార్యక్రమాలతో ఎంతో కీలకమైన సంవత్సరంగా మారబోతుందన్నారు. అలాగే హైదరాబాద్‌లో రెండు జాతీయ స్థాయి సదస్సులను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా వనరుల నిపుణుల (Resource Persons) సమగ్ర డేటాబేస్‌ను టీజీపీఎస్సీ రూపొందించిందని వెల్లడించారు. గ్రూప్--3 సేవల్లో ఎంపికైన నూతన ఉద్యోగులకు వ్యవస్థబద్ధమైన శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది అంతా బాధ్యతాయుతంగా, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని చైర్మన్ పిలుపునిచ్చారు.

# జిల్లాలో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**కరీం నగర్ జనవరి26( సమయం న్యూస్) :** సోమవారం ఉదయం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారుఈ సందర్భంగా దేశభక్తి ఉట్టిపడేలా జరిగిన ఈ వేడుకలకు జిల్లా ప్రజలు, అధికారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. .అనంతరం కలెక్టర్ జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లా యంత్రాంగం సాధించిన ప్రగతిని ఆయన తన సందేశంలో వివరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల పనితీరును, సాధించిన విజయాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గేయాలు, సాంస్కృతిక నృత్య రూపకాలు అలరించాయి. కార్యక్రమంలో భాగంగా, జిల్లాలో అంకితభావంతో విధులు నిర్వహించి, విశిష్ట సేవలు అందించిన వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు, ఆరోగ్య పాఠశాల స్టూడెంట్ ఛాంపియన్లకు, ఇతరులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు, ఎస్పీ అఖిల్ మహాజన్ లతో కలిసి కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. అనంతరం స్టాల్ లను సందర్శించి, పలువురు రైతులకు వ్యవసాయ ఉపకరణాలు అందించారు. ఈ వేడుకలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన



**మహబూబ్ నగర్ జనవరి26( సమయం న్యూస్):** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ జిల్లా పరేడ్ గ్రౌండ్ మైదానంలో ఘనంగా నిర్వహించిన వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ప్రదర్శించిన శకటాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న సేవలను ప్రతిబింబించే విధంగా ఈ శకటాలను రూపొందించారు. ఈ శకటాల ప్రదర్శనలో వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, పురపాలక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్ శాఖ, అగ్నిమాపక శాఖ ,మహిళా శిశు సంక్షేమ శాఖ,అటవీ శాఖలు పాల్గొని తమ శాఖల పనితీరును వినూత్నంగా ప్రదర్శించాయి. రంగురంగుల అలంకరణలు, సందేశాత్మక నమూనాలు, సృజనాత్మక ఆవిష్కరణలతో శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శకటాల ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శాఖలకు బహుమతులు ప్రకటించారు. ఇందులో పురపాలక శాఖ శకటానికి ప్రథమ బహుమతి లభించగా, వైద్య ఆరోగ్య శాఖ శకటానికి ద్వితీయ బహుమతి అందింది. అగ్నిమాపక శాఖ శకటానికి తృతీయ బహుమతి లభించింది. ఆయా సంబంధించిన శాఖ అధిపతులు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ శకటాల ప్రదర్శన ద్వారా ప్రభుత్వ శాఖలు చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెరిగిందని, గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రత్యేక శోభ చేకూరిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్



**హైదరాబాద్ జనవరి 26( సమయం న్యూస్) :** ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్, జాతిపిత మహాత్మాగాంధీ గార్ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు, శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, డిప్యూటీ చైర్మన్ శ్రీ బండా ప్రకాష్ ముదిరాజ్ గారు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు మరియు కౌన్సిల్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, అధికారులు. భారతీయులందరికి హృదయ పూర్వక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సభాపతి ప్రసాద్ కుమార్ గారు.

# 77వ భారత గణతంత్ర దినోత్సవం



**-- జనగామ జిల్లా వేడుకలు**

**జనగామ:జనవరి26 ( సమయం న్యూస్) :** 77వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనగామ జిల్లాలో వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగం, రాజ్యాంగ సృష్టి, భారత ప్రజాస్వామ్యం పట్ల ఘన నివేదిక ప్రకటించారు. జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకి అందుబాటులోకి వచ్చిన అంశాలు:మహాలక్ష్మి పథకం: మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం, 2.89 కోట్ల ప్రయాణికులు లబ్ధి పొందారు. గృహజ్యోతి: 200 యూనిట్లకు దిగువ విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా. ఇందిరమ్మ ఇండ్లు: 2024-25లో 5,834 ఇళ్ళు కేటాయింపు, జిల్లా రాష్ట్రంలో 76.20% పూర్తి స్థాయితో ముందు. రాజీవ్ ఆరోగ్యశ్రీ: వైద్య పరిమితి 10 లక్షల వరకు పెంచి 17,346 మంది పేదలకు చికిత్స అందించింది. వ్యవసాయం: యూరియా బుకింగ్ యాప్ ద్వారా 57,449 మంది రైతులు 2 లక్షల యురియా బస్తాలు సులభంగా పొందారు.

PMDDKY: 36 కేంద్ర పథకాలను అనుసంధానం చేసి సమగ్ర వ్యవసాయ అభివృద్ధి. రైతు జీవిత భీమా & ఆయిల్ పామ్ పథకాలు: రైతులకు లక్షల రూపాయల లాభాలు. ప్రజా పంపిణీ వ్యవస్థ: 1.85 లక్షల రేషన్ కార్డు దారులకు నిత్యావసర సరుకులు, మహాలక్ష్మి పథకం ద్వారా 76,448 కుటుంబాలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు.

వైద్య, ఆరోగ్య కార్యక్రమాలు: 1 వైద్యశాల, 16 ప్రాథమిక కేంద్రాలు, 4 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 104 ఆరోగ్య ఉప కేంద్రాలు; మాతా-శిశు, ఆస్కార, వ్యాధి నివారణ, డిక్సూచి, చీరాజ 2025 లో జిల్లా జాతీయ స్థాయిలో ముందస్తు గుర్తింపు.

విద్య: 98.81% SSC ఉత్తీర్ణత, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, విజయోస్తు 2.0, కేజీబీవీ Excellence Institutes, విద్యార్థుల సామగ్రిక వికాస కార్యక్రమాలు.

మహిళా శిశు సంక్షేమం ౘ బేటి బచావో-బేటి పడావో: 24,565 మంది చిన్నారులకు భోజనం, స్వయం సహాయక సంఘాల ద్వారా వ్యాపార, ఆర్థిక శక్తివంతం.

పేదరిక నిర్మూలన ౘ ఆసరా ఫించన్లు: 75,179 మంది లబ్ధి పొందారు.

జిల్లా అభివృద్ధి, మునిసిపాలిటీ, నీటి సరఫరా, రోడ్డు, మత్స్యశాఖ, ఎక్సైజ్, పోలీస్ శాఖ కార్యకలాపాలు: ప్రతి శాఖలో సమగ్ర అభివృద్ధి మరియు సేవలు.

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, తాము చేపట్టిన కార్యక్రమాల విజయానికి, ప్రభుత్వం మరియు ప్రజలకు సహకరించిన ప్రతీ వ్యక్తికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# వివేక విద్యా భారతి ఉన్నత పాఠశాలలో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ (డీ.జీ )ఆఫ్ NCC సరోజ బాల ఠాగూర్ డాక్టర్. డి.పుల్లయ్య




**అమంగల్, జనవరి,26(సమయం న్యూస్) :** స్థానిక వివేక విద్యా భారతి పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ NCC సరోజ బాల ఠాగూర్ మరియు డాక్టర్ డి పుల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ అనంతరం సరోజ బాల ఠాగూర్ మాట్లాడుతూ, (నేషనల్ క్యాడెట్ కార్ప్స్)చీజజ లో చేరడం వల్ల విద్యార్థులలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి మరియు శారీరక దృఢత్వం పెరుగుతాయనీ. ఇది డిఫెన్స్ (ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్), పారా మిలిటరీ మరియు పోలీస్ ఉద్యోగాలలో 'సి'( 'జ') సర్టిఫికేట్ హోల్డర్లకు ప్రత్యేక రిజర్వేషన్లు, బోనస్ మార్కులు మరియు రాత పరీక్ష మినహాయింపు వంటి గొప్ప ప్రయోజనాలను అందిస్తుందని తెలియజేశారు. అనంతరం ఎన్ సీ సీ (చీజజ)లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ప్రిన్సిపల్ మహమూద్,ఉపాధ్యాయులు మల్లేష్, కరుణాకర్, విజేశీదర్, నజీర్, భరత్, అజ్రా, స్వప్న, రత్నకుమారి, అరుణ, షమీం, కీర్తి, మీనా, స్వాతి, శంకర్, అంజు విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చిట్లపల్లి లో 77వ గణతంత్ర దినోత్సవ సంబరాలు

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ జ్యోతి



**కొడంగల్ మండలం జనవరి,26(సమయం న్యూస్) :** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కొడంగల్ మండలం చిట్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం జెండా వందన సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు బనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ జెండా వందన ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ జ్యోతి ఉపసర్పంచ్ చంద్రకళ అలాగే వార్డు సభ్యులందరూ ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి విద్యార్థులను అభినందించారు అలాగే ఈ సందర్భంగా నిర్వహించిన ఆటపోటీలకు గాను గెలుపొందిన విద్యార్థులకు వారి చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేశారు. మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి గ్రామ పెద్దలు అంగన్‌వాడీ మరియుపాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు



## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తెలంగాణ శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు.

డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ , ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్ , చిన్నా రెడ్డి , మల్కా కొమురయ్య , దయానంద్ , తక్కెళ్లపల్లి రవీందర్ రావు , శ్రీపాల్ రెడ్డి , అంజిరెడ్డి , వాణీదేవి , తెలంగాణ శాసన మండలి సెక్రెటరీ డా. నరసింహా చార్యులు , తదితరులు పాల్గొన్నారు.

## జాతీయజెండను ఆవిష్కరించిన సర్పంచ్ రేణుకదేవి కిషన్ రావు



**యాలాల మండలం, జనవరి,26(సమయం న్యూస్) :** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా యాలాల మండలం దేవనూర్ గ్రామపంచాయతీ నందు జాతీయజెండాను ఆవిష్కరించిన దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకదేవి కిషన్ రావ్ అలాగే జెడ్పిహెచ్ఎస్ స్కూల్ లో ఆట పోటీలలో గెల్లుపుపొందిన వారికీబహుమతులు అందజేశారు.. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొడ్క మాధవి,పంచాయతీ కార్యదర్శి పావని రెడ్డి,వార్డు సభ్యులు గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు,నాయకులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ మినీ స్టేడియంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు.

- జాతీయ జెండాను ఎగురవేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



**నిర్మల్ జనవరి 26( సమయం న్యూస్).:** సోమవారం, పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘన ంగా నిర్వహించారు. ఈ కార్య్ర కమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, పోలీసు పరేడ్ వాహనంపై పరేడ్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వివిధ శాఖలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిగురించి వివరాలను వెల్లడించారు. ఆ తర్వాత కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలల విద్యార్థులచే దేశభక్తి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. పోలీసుల ఉత్తమ సేవలకు గాను పలువురికి మెడల్స్ అందించారు. ఉత్తమ పనితీరుకు ప్రశంసా పత్రాలు కొలమానమని తెలిపారు. రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తూ జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచాలని అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్ళను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిళ, అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లు, భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, అదనపు ఎస్పీలు సాయికిరణ్, ఉపేంద్రా రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు, ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

● జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్



**నారాయణపేట, జనవరి,26(సమయం న్యూస్) :** 77వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. మైదానంలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాల్స్ ను పరిశీలించారు. ఎస్.పి.డాక్టర్ వినీత్ అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను అడిషనల్ ఎస్పీ రియాజ్ హోల్ హోక్ , డి.ఎస్.పి.లింగయ్య, ఆర్డీవో రామచందర్ నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు కాంత్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్ కార్యాలయంలో, జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మువ్వన్నెల జెండా ఆవిష్కరించారు.

## అభివృద్ధి సంక్షేమ పథకాలు చివరి వ్యక్తి వరకు అందే విధంగా అధికారులు కృషి చేయాలి

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





**సూర్యాపేట, జనవరి26( సమయం న్యూస్) :** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన 77 వ గణతంత్ర దినోత్సవం లో ఆయన పాల్గొన్నారు.

ముందుగా స్వాతంత్ర్య సమరయోధులకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాలాపన, తెలంగాణ రాష్ట్రీయ గీతాలాపన చేశారు. అనంతరం సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నేటితో రాజ్యాంగం అమల్లోకి వచ్చి 77 సంవత్సరాలు పూర్తయిందని, ఉద్యోగులు రాజ్యాంగ నిబంధనలు ప్రకారం విధులు నిర్వహించాలని సూచిం చారు. సమాజంలో వెనుకబడిన ఎస్టీ, ఎస్సీ, బీసీ ల కొర కు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ,అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికి అందే విధంగా అధికారులు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. అందరు ఐక్యంగా ఉంటూ అన్ని రంగలాల్లో భారతదేశాన్ని బలోపేతం చేసేదిశగా ముందుకు వెళ్లాలని కోరారు. ఒక్కొక్క ఫైలు క్షేత్రస్థాయిలో ఒక్కరి జీవితం పై ఆధారపడి ఉంటుంది కాబట్టి వేగవంతంగా క్షేత్రస్థాయిలో ఫైల్స్ ను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామరావు, జిల్లా అధికారులు,పరిపాలనాధికారి సుదర్శన్ రెడ్డి,అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

ప్రశంస పత్రాలు అందజేత... జిల్లాలో విధి నిర్వహణలో అత్యంత ప్రతిభ చూపెట్టిన వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులకు,పోలీస్ లకు, ఉద్యోగులకు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ కే సీతారామారావు, అదనపు ఎస్పి లు రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, నరసింహ చారి, ఆర్డీఓ వేణుమాధవ్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు హాజరైనారు.

స్టాల్స్ సందర్శన,,, పోలీస్, గ్రామీణ అభివృద్ధి సంస్థ,అటవీశాఖ, పౌరసరఫరాల శాఖ,జిల్లా సంక్షేమ శాఖ,మెప్మా, వైద్య ఆరోగ్యశాఖ, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలు,మత్స్యశాఖ,మిషన్ భగీరథ,విద్యాశాఖ,అగ్నిమాపక శాఖ,యువజన సర్వీసులు ఉ క్రీడల శాఖ,హౌసింగ్,వ్యవసాయ, ఉద్యానవన రవాణా, పశుసంవర్ధన శాఖలచే ఏర్పాటు చేసిన స్టాల్స్ లను జిల్లా ఎస్పి తో కలిసి కలెక్టర్ సందర్శించారు



## హెపటైటిస్ -(బి) వ్యాక్సిన్ తీసుకుంటున్న సూపర్ వైజర్ రఫీ

**దౌల్తాబాద్ మండలం,26,జనవరి(సమయం న్యూస్) :** జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ పి హెచ్ సి లో హెపటైటిస్ వైరస్ ( కాలేయ సంబంధిత వ్యాధి) సోకకుండా ముందు జాగ్రత్తలో భాగంగ పి హెచ్ సి సిబ్బంది అందరికీ హెపటైటిస్ -బీ వ్యాక్సిన్ ఇవ్వడం జరిగిందని వైద్యాధికారి అమూల్య ప్రియదర్శిని తెలిపారు ఇట్టి కార్యక్రమం లో పిహెచ్ సి (గ్రాంజ )సిబ్బంది అందరూ పాల్గొని అందరూ వ్యాక్సిన్ తీసుకోవడం జరిగింది.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేసిన బారు అరవింద్



**సమయం న్యూస్ గజ్వేల్ జనవరి 26 :** మెదక్ ఎంపీ రఘునందన్ రావు సహకారం తో దాతర్ పల్లి గ్రామంలోని జూపల్లి ప్రసాద్ కూతురు నిత్య శ్రీ కి 60,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ నీ అందించిన బిజెపి గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి బారు అరవింద్ గ్రామ పెద్దలు యువత ఆధ్వర్యంలో లబ్ధిదారుడికి అందివ్వడం జరిగింది

## రూ.1 కోటి విలువైన 10 టన్నుల నకిలీ( హెచ్ టి) పత్తి విత్తనాలు పట్టివేత

● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

● అక్రమ నకిలీ పత్తి విత్తనాల వ్యాపారంపై ఉక్కు పాదం: జిల్లా ఎస్పీ.



**నారాయణపేట, జనవరి,26(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లాలో రైతులను మోసం చేస్తూ నకిలీ హెచ్ టి( ఃు) పత్తి విత్తనాలను అక్రమంగా విక్రయిస్తున్న వారిపై నారాయణపేట జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. సోమవారం నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పత్రిక సమావేశం నిర్వహించి, జిల్లాలో పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాల వివరాలను వెల్లడించారు.తేదీ 25.01.2026 సాయంత్రం నారాయణపేట మండలం బండగొండ గ్రామం మరియు కొత్తపల్లి మండలం భూనీడ్ గ్రామంలలో జిల్లా పోలీసులు, టాస్క్ ఫోర్స్ ప్రత్యేక పోలీసు బృందం మరియు వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో, సుమారు రూ.1 కోటి విలువైన 10 టన్నుల (100 క్వింటాళ్ల) నకిలీ హెచ్ టి (ఃు)పత్తి విత్తనాలను నిందితులైన తండ్రీకొడుకుల ఇళ్ల నుండి మరియు వారి స్వాధీనంలో నుంచి స్వాధీనం చేసుకున్నారు.

నిందితుల వివరాలు:ఎ1: వి. బాలకృష్ణ నాయుడు,
నివాసి: భూనీడ్ గ్రామం, కొత్తపల్లి మండలం, నారాయణపేట జిల్లా.
ఎ2: శశివర్ధన్ నాయుడు,
నివాసి: భూనీడ్ గ్రామం, కొత్తపల్లి మండలం, నారాయణపేట జిల్లా.

ఈ ఘటనకు సంబంధించి నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు, మద్దూరు పోలీస్ స్టేషన్‌లో మరో కేసు చొప్పున మొత్తం రెండు కేసులు నమోదు చేయబడినట్లు ఎస్పీ తెలిపారు.విచారణలో, నిందితులు నకిలీ హెచ్ టి( ఃు )పత్తి విత్తనాలను అక్రమంగా రవాణా చేసి, నారాయణపేట జిల్లాలో రైతులకు అధిక ధరలకు విక్రయిస్తూ భారీగా లాభాలు పొందుతున్నట్లు తేలింది. ఎ1 నిందితుడు గతంలో మద్దూరు, నర్వ మరియు దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు వెల్లడైంది. ఆ కేసులన్నీ ప్రస్తుతం కోర్టుల్లో విచారణలో ఉన్నాయి.

ఎస్పీ హెచ్చరిక:ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ మాట్లాడుతూ...వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న రైతులను మోసం చేసే నకిలీ విత్తనాల వ్యాపారంలో ఎవరైనా పాల్గొంటే, రవాణా చేసినా, సరఫరా చేసినా లేదా అధిక ధరలకు విక్రయించినా, వారిపై చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ప్యాకింగ్ లేని లేదా అనుమానాస్పద విత్తనాలను కొనుగోలు చేయవద్దని, నకిలీ విత్తనాల వ్యాపారం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు లేదా వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ మాట్లాడుతూ... ఇప్పుడు పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు సుమారు మూడు మండలాల్లో పంటలు వేయడానికి సరిపడే పరిమాణంలో ఉన్నాయని తెలిపారు. రైతులు గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ షాపులలోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని, లాట్ నెంబర్ ఉన్న విత్తనాలనే కొనాలని సూచించారు. ఎక్కడైనా అక్రమంగా నకిలీ విత్తనాలు అమ్మితే వెంటనే పోలీసులకు లేదా వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

అభినందనలు:ఈ కేసును విజయవంతంగా ఛేదించినందుకు, డీఎస్పీ నల్లపు లింగయ్య పర్యవేక్షణలో సమర్థవంతంగా పనిచేసిన నారాయణపేట మరియు కోస్గి సీఐలు, శివశంకర్, సైదులు, నారాయణపేట రూరల్ మరియు మద్దూరు ఎస్ఐలు విజయ్ కుమార్, రాముడు, టాస్క్ ఫోర్స్ ఎస్సై పురుషోత్తం, ప్రత్యేక పోలీసు బృందం మరియు వ్యవసాయ శాఖ అధికారులను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ అభినందించారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

● జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్



**నిజామాబాద్, జనవరి 26 ( సమయం న్యూస్) :** భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. అర్బన్ శాసన సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా అధికారులు, పుర ప్రముఖులకు కలెక్టర్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు బహూకరించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ, అటవీ, డెయిరీ, పశువైద్య, విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, నీటి పారుదల, మిషన్ భగీరథ, ఫిషరీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో పాటు ఇతర సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును చాటుతూ వ్యవసాయం, హౌసింగ్, డీఆర్డీఏ, ట్రాన్స్ కో, పౌర సరఫరాలు, వైద్యారోగ్య, రాజీవ్ ఆరోగ్యశ్రీ,, 108, 102 అంబులెన్స్ లు, మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్, హెచ్ ఐ వీ ఎయిడ్స్ తదితర శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది.

ఉత్సాహభరితంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు .... రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఎదనిండా దేశభక్తి భావాన్ని నింపుకుని తమ ప్రదర్శనలతో గణతంత్ర దినోత్సవ వేడుకలకు వన్నెలద్దారు. విస్డమ్ హైస్కూల్ విద్యార్థులు తల్లీ భారతి వందనం గేయంపై, వసుధ హైస్కూల్ చిన్నారులు శంభాజీ మహరాజ్ శౌర్య పరాక్రమం గురించి, విజయ్ హైస్కూల్ పాఠశాలకు చెందిన బాలబాలికలు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాల్సిన ప్రాముఖ్యత గురించి చూడచక్కని నృత్య రీతులను అలవోకగా ప్రదర్శిస్తూ ఔరా అనిపించారు. డిచ్ పల్లి మానవతా సదన్ విద్యార్థిని విద్యార్థులు ఒకే శృతిలో డప్పు వాయిస్తూ తమ కళా నైపుణ్యాన్ని చాటారు. బాలబాలికలు అందరూ ఏకరూప దుస్తులు ధరించి తమ అభినయంతో అలరింపజేశారు. జాతీయ సమైక్యతా భావం పెంపొందేలా దేశభక్తి గేయాలు ఆలపిస్తూ నృత్య ప్రదర్శనలతో అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా చిన్నారులను కలెక్టర్, సీ.పీ తో పాటు ఇతర అతిథులు, జిల్లా ఉన్నతాధికారులు వారి వద్దకు వెళ్లి మెమోంటోలు, ప్రశంసా పత్రాలను బహూకరించి ప్రత్యేకంగా అభినందించారు. స్వయం సహాయక సంఘాలకు స్త్రీనిధి రుణాల చెక్కులు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో డీఆర్డీఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ రావు, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు క్యాంపు ఆఫీసులో, జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి మువ్వన్నెల జెండా ఆవిష్కరించారు.

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో... సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి 77 వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు.

● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.



**నారాయణపేట, జనవరి,2 6(సమయం న్యూస్) :** 77 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు మరియు అధికారులకు సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపినారు. ఈ సందర్భంగా ఎస్పీ మాటాడుతూ...ఎందరో త్యాగధనుల ఫలితమే గణతంత్ర దినోత్సవం అని వారిని ఎప్పుడూ మనం స్మరిస్తూ ఉండాలి అని వారి త్యాగఫలం ద్వారా మనం ఈరోజు ఎంత స్వేచ్ఛగా స్వతంత్రంగా జీవిస్తున్నామని తెలిపినారు.మనకు స్వాతంత్రం వచ్చిన తరువాత సమాజంలో విలువలకు కట్టుబడి ఉండాలి అనేది రాజ్యాంగంలో రూపొందించబడింది తెలిపారు.స్వేచ్ఛ ,సమానత్వం ,సౌభ్రాతృత్వం అనే విలువలతో మన రాజ్యాంగం రూపొందించబడింది అని ఈ యొక్క రాజ్యాంగానికి కట్టుబడి ప్రతి ఒక్క చట్టం అమలు చేయబడుతుంది అని తెలిపారు. ఈ చట్టాలను అమలు చేసే బాధ్యత అందరికంటే ముందుగా పోలీసు డిపార్ట్మెంట్ పై ఉందని కాబట్టి ఈ యొక్క విలువలను మరొకసారి గుర్తు చేసుకుంటూ ఈ యొక్క విలువలకు కట్టుబడి చట్టాలను అమలు చేస్తామని, జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వీణ రియాజ్ హుల్ హక్,డీఎస్పీ ఎన్ లింగయ్య , సిఐ లు రామ్ లాల్, శివ శంకర్, సైదులు, భగవంత్ రెడ్డి, ఆర్ఐ నరసింహ,ఎస్సై లు,డిపిఓ (ఖూా) స్టాఫ్, అన్ని వింగ్స్ పోలీసులు, హెడ్ క్వార్టర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భారత సైన్యంలో చేరి దేశానికి సేవ చేయండి

● యువతకు భారతీయ ఎయిర్ వెటరన్ రాజా నరసింహారావు సూచన



**ముషీరాబాద్, జనవరి 26 :** దేశం పట్ల అభిమానం కలిగిన యువతీ యువకులు అగ్నివీర్ పథకం ద్వారా భారత సైన్యంలో చేరి మాతృభూమికి సేవ చేయాలని రిటైర్డ్ వాయుసేన అధికారి రాజా నర్సింహారావు అన్నారు. 77వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం సికింద్రాబాద్ న్యూ బోయిగూడలోని జైనగర్ కాలనీ, గొల్ల కొమరయ్య కాలనీ బస్తీలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ 18 ఏళ్ల వయసు కలిగి పదవ తరగతి పాస్ అయిన వాళ్ళు అన్ని మీరు పథకం ద్వారా పరీక్ష రాసి పాస్ కావాలన్నారు. ఎంపికైన వారు నాలుగేళ్లపాటు ఇండియన్ ఆర్మీ, నేవీ, వాయుసేన లో సైనికులుగా పని చేయవచ్చని తెలిపారు. అనంతరం వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ కూడా ఉంటుందని అన్నారు. ఇటీవల 45 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల అయ్యిందని, ఆసక్తిగల యువతీ యువకులు అగ్నివీర్ పథకం లో దరఖాస్తు చేసుకుంటే వారికి ఉచితంగా గైడెన్స్ ఇస్తానని రాజా నర్సింహారావు తెలిపారు. ప్రతీ ఒక్కరి జీవితంలో సమయం చాలా విలువైనదని, దానిని వృధా కాకుండా జాగ్రత్త పడాలని అన్నారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నతమైన లక్ష్యంతో జీవితంలో పైకి ఎదగాలని ఆయన సూచించారు.

# రాయపోల్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**రాయపోల్, జనవరి 26:** రాయపోల్ మండలంలో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ కృష్ణమోహన్,మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో శ్రీనివాస్ రావు,మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ రాజగోపాల్ రెడ్డి,పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మానస, పీహెచ్‌సీ వద్ద డాక్టర్ మహారాజ్ బల్లా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద హెచ్ఎం వెంకటేశ్వర్,రాయపోల్ గ్రామ పంచాయితీ వద్ద సర్పంచ్ రాజు,మహిళా సమాఖ్య భవనం వద్ద ఏపీఎం యాదగిరి,మండలం లోని వివిధ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షులు తప్పెట సుధాకర్, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షులు వేంకటేశ్వర శర్మ జాతీయ జెండాను ఎగురవేశారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, దిశ కమిటీ సభ్యులు రవీందర్ రెడ్డి గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతపై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భారతదేశం ఒక సార్వభౌమ, సామ్యవాద,లౌకిక, ప్రజాస్వామ్యశీ గా అవతరించడానికి రాజ్యాంగం ఎలా మార్గదర్శకంగా నిలిచిందో వివరించారు.ప్రతి పౌరునికి సమాన హక్కులు,స్వేచ్ఛ, న్యాయం కల్పించడమే రాజ్యాంగ లక్ష్యమని తెలిపారు.డా.బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగం దేశ ప్రజల ఆశయాలకు ప్రతిబింబమని, అణగారిన వర్గాలకు హక్కులు కల్పించడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.విద్యనే ఆయుధంగా చేసుకుని సామాజిక అసమానతలపై పోరాడాలని అంబేద్కర్ పిలుపునిచ్చిన సందేశాన్ని విద్యార్థులు ఆచరణలో పెట్టాలని సూచించారు. రాజ్యాంగ విలువలను గౌరవించడం ద్వారానే నిజమైన గణతంత్ర దినోత్సవ స్ఫూర్తి నిలుస్తుందని పేర్కొన్నారు.అనంతరం మొక్కజొన్న పొట్టుతో బయోమెట్రిక్ తయారు చేసిన విద్యార్థి నిషాంత్ రెడ్డి,ఉపాధ్యాయురాలు స్వాతి ని హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీనివాస్ రావు, దిశ కమిటీ సభ్యులు రవీందర్ రెడ్డిలు నగదు సహాయం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు చూపరులను ఆకట్టుకు న్నాయి.అలాగే వివిధ పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తుగారి యాదవ రెడ్డి సొంత నిధులతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాసన్‌పల్లి రాజు ఉప సర్పంచ్ రాజు వార్డ్ మెంబర్లు యాదగిరి, ప్రభాకర్, రాములు సెక్రెటరీ శివకుమార్,గ్రామ యువకులు యు. స్వామి,నరేష్,ప్రసాద్, నందు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**● జాతీయ జెండాను ఎగరవేసిన కాలేజీ ప్రిన్సిపాల్ వసంత**



**దౌల్తాబాద్ మండలం, జనవరి,26(సమయం న్యూస్):** దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ వసంత జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం భారత రాజ్యాంగం చరిత్రను, రాజ్యాంగ హక్కులను, విలువలను విద్యార్థులకు తెలియజేశారు.1950 జనవరి 26 న ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత, ధృడ రాజ్యాంగం అమలులోకి వచ్చిందన్నారు. కావునా విద్యార్థులందరూ భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకుంటూ, రాజ్యాంగంలో పేర్కొన్న విధుల నిర్వహణలో కూడా ప్రతిఒక్కరూ బాధ్యతను కలిగి ఉండాలని పేర్కొన్నారు.. కళాశాలలోని విద్యార్థులు చదువుతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ప్రతిభను కలిగి ఉన్నారని, అలాంటి విద్యార్థులను మరింత ప్రతిభావంతులుగా తయారు చేసేందుకు మేమందరం నిరంతరం కష్టపడుతున్నామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం జరగబోయే ఫైనల్ ఎగ్జామ్ లో విద్యార్థులందరూ అత్యున్నత ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బోడి వెంకట్ రెడ్డి, రిటైర్డ్ హెడ్మాస్టర్ వీరన్న, రిటైర్డ్ ఎంఈఓ బాబుసింగ్, రిటైర్డ్ హెడ్మాస్టర్ ప్రభాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కళాశాలలో గత 4 రోజులుగా నిర్వహించిన ఆటపోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించిన డీపీ ఆర్ ఓ

**● మీడియా (ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్) మిత్రులకు శుభాకాంక్షలు తెలిపిన డి పి ఆర్ ఓ ఎం.ఏ.రషీద్**



**నారాయణపేట, జనవరి,26(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని జిల్లా పౌర సంబంధాల,సమాచార శాఖ కార్యాలయంలో పౌర సంబంధాల శాఖ అధికారి ఎం.ఏ. రషీద్ 77 వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, మీడియా ( ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్)మిత్రులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని యాద్గీర్ రోడ్ మార్గంలో గల మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలలో నిర్వహించిన 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జగదీష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలపై ప్రేమకు చిరునామా... రిటైర్డ్ అటెండర్ బిక్షపతి



**రాయపోల్, జనవరి 26:** రాయపోల్ మండలం తిమ్మప్పపల్లి ప్రాథమిక పాఠశాలపై ఉన్న అభిమానాన్ని కాలం కూడా చెరిపేయలేకపోతోంది.అదే పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహించి,కొన్ని సంవత్సరాల క్రితమే రిటైర్మెంట్ పొందిన బిక్షపతి... ఇప్పటికీ తన బాధ్యతను మర్చిపోలేదు.తన స్వగ్రామం పాఠశాల నుంచి ఎంతో దూరంలో ఉన్నప్పటికీ, ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవం,గణతంత్ర దినోత్సవాల ముందు రోజు ప్రత్యేకంగా తిమ్మక్కపల్లి గ్రామానికి వచ్చి,పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తూ తన అభిమానాన్ని చాటుకుంటున్నారు.తరగతి గదులు,వరండాలు,పరిసర ప్రాంతాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దుతూ పండుగలకు సిద్ధం చేస్తున్నారు.

రిటైర్మెంట్ అయినప్పటికీ పాఠశాల పట్ల చూపిస్తున్న ఈ నిబద్ధత పలువురిని ఆకట్టుకుంటోంది. “ఇది ఉద్యోగం కాదు... నా జీవితం” అన్నట్టుగా బిక్షపతి చేస్తున్న సేవ,నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తోంది.స్థానికులు,ఉపాధ్యాయులు బిక్షపతి సేవలను ప్రశంసిస్తూ, పాఠశాలపై ఆయనకు ఉన్న ప్రేమ నిజంగా అభినందనీయం అని కొనియాడుతున్నారు. గ్రామానికి చెందిన యువకులు నాగరాజు,రాజు,రమేష్,శ్రీకాంత్ లు సోమవారం బిక్షపతిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

# హుస్సేన్ పూర్ లో 77వ భారత గణతంత్ర దినోత్సవం వేడుకలు

**● ప్రధానోపాధ్యాయులు ఇల్లూరి క్రాంతి కుమార్**



**కొడంగల్ మండలం, జనవరి,26(సమయం న్యూస్) :** 77వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా కొడంగల్ మండలం లోని హుస్సేన్ పూర్ గ్రామ పాఠశాలలో అత్యంత వైభవంగా ప్రధానోపాధ్యాయులు ఇల్లూరి క్రాంతికుమార్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్ల అంజిలప్ప, ఉప సర్పంచ్ రమాదేవి, ఉపాధ్యాయురాలు సంధ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి కొండన్న,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మమత గ్రామ వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్, ఆశ వర్కర్లు, మహిళా సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, యువజన సంఘ సభ్యులు, విద్యాభిమానులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుండి గ్రామస్తులు వచ్చి పాల్గొనడం విశేషంఈ సందర్భంగా విద్యార్థులచే కోలాటాలు, నృత్యాలు, పాటలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడినవి.అదేవిధంగా గ్రామ సర్పంచ్ దొడ్ల అంజిలప్ప, ఉప సర్పంచ్ రమాదేవి,మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీచైర్మన్ మమతను ఉపాధ్యాయులు సన్మానించారు.గ్రామ పెద్దలు మరియు యువకులు మంచి కార్యక్రమాలు నిర్వహించినందుకు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

# రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఎమ్మార్వో గా షాబాద్ మండల్ ఎమ్మార్వో అన్వర్,



**చేవెళ్ల, జనవరి 26 (సమయం న్యూస్):** షాబాద్ మండలంఅన్వర్ ని ప్రజల కు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించడంలో ముందున్నందుకుగా ను అదే విధంగా తన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నందుకు గాను ,రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఎంఆరోగా ఎంపిక య్యారు, కాబట్టి ఈసందర్భంగా రంగారెడ్డి జిల్లా గ్రంధ గాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి , శుభాకాంక్షలు తెలిపారు. వారితోపాటు మొయినాబాద్ వీ=ా గౌతమ్ కుమార్ , షాద్నగర్ వీ=ా నాగయ్య , నందిగామ వీ=ా సైదులు గౌడ్ , వున్నారు. ఎలుగంటి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ విభాగంలో రైతులకు వారి యొక్క సమస్యలు పరిష్కరించడంలో ముందుంటుంది అని అన్నారు.

## దొడ్లపల్లి పాఠశాల అభివృద్ధికి దాతల విరాళాలు



**రాయపోల్,జనవరి 26:** రాయపోల్ మండలంలోని వడ్డేపల్లి మధిర గ్రామం దొడ్లపల్లి పాఠశాలలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల అభివృద్ధికి సోమవారం పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ఏకమై విరాళాలు అందజేశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో అవసరమైన వస్తువులను పాఠశాలకు పంపిణీ చేశారు.విరారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ రొయ్యల సుగుణ శ్రీనివాస్ పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్,గ్యాస్ సిలిండర్‌ను అందించారు. వార్డు మెంబర్ కనకరాజు విద్యార్థులకు స్టూడెంట్ ఐడీ కార్డులను అందజేశారు.వార్డు మెంబర్ పెయింటర్ రవి టై, బెల్ట్‌లను అందించారు.బేగంపేట్‌కు చెందిన శ్రీకాంత్ టై,బెల్ట్‌లను అందించారు. పాపగారి నాగరాజు ప్లేట్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.తప్పటి గుట్టకు చెందిన కుమ్మరి కిషన్ పాఠశాలకు బీరువాను అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచి రేణుక రాజగౌడ్ పాల్గొని ఆటపాటల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.ప్రతి విద్యార్థి కష్టపడి చదివి భవిష్యత్తులో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు,గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామ పాఠశాల అభివృద్ధికి ఏకమై సహకరించిన దాతలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు చదువులో రాణించేలా ఉపాధ్యాయ బృందం అన్ని విధాలుగా సహకరిస్తుందని,ఇలాంటి సహకారం ఎప్పుడూ కొనసాగాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శిరీష ,అంగన్వాడీ టీచర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో యువతకు అధిక ప్రాధాన్యతివ్వాలి



**సమయం న్యూస్ గజ్వేల్ జనవరి 26 :** జనాభాలో అత్యధిక శాతం ఉన్న యువత జాతి ప్రగతికి సోపానం అని అందుకే మున్సిపల్ ఎన్నికల్లో అధిక ప్రాధాన్యతివ్వాలని యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు పిలుపునిచ్చారు మన దేశంలో యువత శాతం పెరుగుతోంది. ప్రపంచములో అత్యంత ఎక్కువ మంది యువత ఉన్న దేశంగా భారత్ నిలిచిందని. దేశ అభివృద్ధిలో ఈ యువ మానవ వనరు కీలక పాత్ర పోషిస్తుందని . కేవలం వారిని ఆర్థిక లేదా ఉత్పత్తి రంగంలోనే కాకుండా ఎంతో ప్రాముఖ్యం ఉన్న రాజకీయాల్లోనూ యువతకు తగిన స్థానం కల్పించవలసి ఉందని అప్పుడే నిజమైన నవ సమాజ నిర్మాణం సాధ్యమ వుతుందన్నారు ప్రస్తుతం విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు అనేక పార్టీలకు అనుబంధంగా ఉంటున్నాయి. వీటి నుంచే చాలా రాజకీయ పార్టీలకు నాయకులు లభించిన, లభిస్తున్న సంగతి తెలిసిందే. కేవలం ఆయా సంఘాలలో పనిచేసేవారికే కాక... చురుకుగా పని చేయ గలిగిన సామాజిక స్పృహ ఉన్న యువతనంతా అన్ని రాజకీయ పక్షాలూ ప్రోత్సహించాలని. ఎన్ని కల సమయంలోనో... లేదా ఏవో కొన్ని ఉద్య మాల సందర్భంగానో యువతను, వారి ఆవేశాన్నీ వాడుకుని వదిలేస్తుండటం రాజకీయ పక్షాల్లో కనిపిస్తున్న ట్రెండ్. ఈ ధోరణిని రాజకీయ పార్టీలు విడనాడాలని కోరారు రాజకీయ పార్టీలు యువతకు అన్ని స్థాయిల్లో జరిగే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలి. మొన్నజరిగిన గ్రామ సర్పంచ్ లు వార్డు మెంబర్లు అత్యధికంగా యువత గెలిచి సత్తాచాటారని వార్డు మెంబర్ నుండి అత్యున్నత పార్లమెంట్ సభ్యుని వరకూ వారికి అవకాశం ఇవ్వాలని . యువతీ యువకులు భవిష్యత్ రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రజా ప్రతినిధులుగా ఎదగడానికి శిక్షణా ప్రాంగణాలుగా స్థానిక సంస్థలు మున్సిపల్ ఎన్నికలు ఉపయోగపడతాయన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో యువతీ యువకులకు అవకాశం ఇచ్చి గెలిపించుకోవాలని ఈ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీలను ప్రజలను కోరారు

# 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**నవీన ఆదర్శ హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్. డి.వి నరేష్ రాజ్**



**కొడంగల్ మున్సిపల్, జనవరి,26(సమయం న్యూస్) :** ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవము నిర్వహించిన కొడంగల్ నవీన ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు.. విద్యార్థులు స్వతంత్ర సమరయోధుల వేషాధారణతో. భారీ 500 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తా నుండి పోస్ట్ ఆఫీస్ వరకు భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు భారీ జాతీయ జెండా ర్యాలీ అందరిని ఆకట్టుకున్నది.పాఠశాలలో స్కూల్ ఫౌండర్ డి. లక్ష్మీ వెంకటయ్య, ప్రిన్సిపాల్ డి.వి నరేష్ రాజ్, వైస్ ప్రిన్సిపల్ సంతోష ,ఉపాధ్యాయ బృందం విద్యార్థులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులకు ఆటపోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో తల్లిదండ్రులు విద్యార్థులు ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

# మేడారం..కిక్కిరిసిన భక్తజనం



**మేడారం జనవరి26( సమయం న్యూస్) :** మేడారం.. కిక్కిరిసిన భక్తజనంవనదేవతల మహా జాతర సందడి రోజురోజుకూ పెరుగుతోంది. ములుగు జిల్లాలో సమ్మక్క, సారలమ్మ జాతర ఈ నెల 28 నుంచి ప్రారంభం కానుండడంతో ముందుగానే భక్తులు మేడారం బాట పడుతున్నారు. ఆదివారం వేలల్లో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి ప్రత్యేక వాహనాలు, బస్సుల్లో కుటుంబ సమేతంగా వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. దీంతో మేడారంతో పాటు పరిసరాలన్నీ భక్తజనంతో కిక్కిరిసిపోయాయి. క్యూలైన్లలో బారులుతీరి గద్దెల ప్రాంగణం చేరుకొని బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# ఘనంగా తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు.



**హైదరాబాద్ జనవరి26( సమయం న్యూస్)** :ప్రజా స్వామ్య వ్యవస్థలో భాగంగా సర్వసత్తాక సార్వభౌమిక దేశం మన భారతదేశం అని తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారంనాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి కార్యాలయంలో 77వ గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 1947లో స్వాతంత్ర్యం వచ్చాక ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించాలనే సంకల్పంతో డా.బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగాన్నిరచి ంచారు. రాజ్యాంగం 1950 జనవరి, 26వ తేదీ నుండి అమలులోకి వచ్చిందన్నారు. ప్రతి మనిషికి జీవించే హక్కు, వైద్య, విద్యా హక్కు, రక్షణ వ్యవస్థ, చట్టాలు, మొదలగు అంశాల గురించి రాజ్యాంగంలో పొందుపర్చారని ఆయన వివరించారు. దేశానికి ప్రజాస్వామ్య వ్యవస్థ మూలం అన్నారు. మన రాజ్యాంగం రూపొందించిన ప్రకారం దేశంలోని కోట్ల మంది ప్రజలు తమ మత విశ్వాసాలు, మతాల అనుశాసనం ప్రకారం ఎవ్వరికి నచ్చిన మతాన్ని వారు ఆచరిస్తున్నారని తెలిపారు. మన రాజ్యాంగ స్ఫూర్తితో మన దేశంలో అందరికి సమాన హక్కులు, కుల, మత, లింగ, వర్ణ భేదాలు లేకుండా ప్రపంచంలో పరిపాలన అందిస్తున్న ఎకైక దేశం మన దేశమే అన్నారు. ఆ నాడు దళిత వర్గాలకు, పేద వర్గాలకు నష్టం వాటిల్ల కుండా బాబా సాహెబ్ అంబేద్కర్ ఆ నాడే ఆలోచించి అందిరికి తగిన న్యాయం జరిగేలా రాజ్యాంగంలో పేర్కొన్నారని తెలిపారు. అదే విధంగా దేశంలో కులాలు, మతాలు, ఎవరి విశ్వాసాలు వారికి ఉన్నా దేశంలోని పౌరులంతా భారతీయులే అని మన రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నారని ఆయన వివరించారు. మనం ఈ రోజు కుల, మత వివక్ష లేకుండా అందరం కలిసి మెలసి జీవిస్తున్నామంటే రాజ్యాంగం మనకు కల్పించిన సమాన హక్కులు, అవకాశాలు మాత్రమే అని అన్నారు. ఈ ఫలాలు రాబోయే మన ముందు తరాలకు కూడా అందాలని ఆయన ఆకాక్షించారు. అదే విధంగా తెలంగాణ మీడియా అకాడమీ జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణా తరగతుల ద్వారా జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలు పెంపొందించడానికి కృషి చేయాలని అన్నారు. రాబోయే రోజులలో జర్నలిస్టుల సంక్షేమం, జర్నలిస్టుల శిక్షణా కార్యక్రమాల నిర్వహణ ద్వారా తెలంగాణ మీడియా అకాడమి దేశంలోనే మొదటిస్థానంలో ఉండేలా అకాడమి సిబ్బంది అందరం కలిసి పని చేద్దాం అని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమి సెక్రటరీ నాగులపల్లి వెంకటేశ్వర రావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణ చందర్ రావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, ఎమ్.కె. రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

# ఎదులాపురం పరిధిలో రూ. 2.5 కోట్లతో పలు అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన



**ఖమ్మం, జనవరి 26 : ( సమయం న్యూస్ )** :రాబోయే రోజుల్లో ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక ఆదర్శవంతమైన (రోల్ మోడల్) మున్సిపాలిటీగా తీర్చుదిద్దడమే తన లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో సుమారు రూ. 2.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సి.సి. రోడ్లు, డ్రైనేజీ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు చేశారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రివర్యులు, కోట నారాయణపురంలో రూ. 22.6 లక్షలతో సి.సి. డ్రైను నిర్మాణానికి, ఎస్సీ, బీసీ కాలనీలో రూ. 72 లక్షల వ్యయంతో అంతర్గత సి.సి. రోడ్లు, డ్రైన్ల పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే గుదిమళ్ళలో రూ. 44.55 లక్షలతో, ఇందిరమ్మ కాలనీ-1లో రూ. 75.85 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సి.సి. రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. వీటితో పాటు నంద్యాతండాలో రూ. 26.55 లక్షల వ్యయంతో డ్రైన్లు, జంగాల కాలనీలో రూ. 14.10 లక్షలతో సి.సి. రోడ్లు, డ్రైన్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఎదులాపురం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే పూర్తి బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు తెలిపారు. పేదవాని కష్టం తెలిసిన ప్రభుత్వం తమదని, అందుకే అర్హులైన ప్రతి పేదవానికీ ఇళ్లతో పాటు ఇళ్ల స్థలాలు కూడా ఇస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాధ బాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధి పథంలో నిలుపుటకు అందరి సహకారం ఎంతైనా అవసరం

## -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, జనవరి,26(సమయం న్యూస్) :** జిల్లాను అభివృద్ధి పథంలో నిలుపుటకు అందరి సహకారం ఎంతైనా అవసరమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.77వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ జాతీయ జెండాను ఎగురవేశారు. ముందుగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా లు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రపంచంలోనే గొప్ప సర్వసత్తాక,సామ్యవాద, లౌకిక,ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా భారతదేశమును నిలుపుకునేందుకు భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సారిధ్యంలో భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి తెచ్చుకున్నామన్నారు.ప్రజా పాలన, పారదర్శకతతో సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ సామాజిక న్యాయము సమాన అవకాశాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన తెలిపారు.రాష్ట్రంలో ఆడపడుచులు ట్రాన్స్ జెండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 5 కోట్ల 15 లక్షల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారని ఆయన తెలి పారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల రూపాయల వరకు 849 కోట్ల రూపాయల రుణమాఫీ చేసిందని ఆయన తెలిపారు. రైతు బీమా ద్వారా మరణించిన రైతులకు 5 లక్షల చొప్పున 367 కోట్ల రూపాయలను నామిని ఖాతాల్లో జమ్మ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఇండ్లు లేని నిరుపేదలు 265269 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 12863 గృహాలు నిర్మించుకోవడానికి ఆమోదించినట్లు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద జిల్లాలో 19888 కుటుంబాలకు 12 కోట్ల చెల్లింపులు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. గృహ జ్యోతి కింద 142932 కుటుంబాలకు 70 కోట్ల 44 లక్షల సబ్సిడీని ప్రభుత్వ అందజేసిందని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 119735 మంది లబ్ధి చేకూరుతుందని ఇప్పటికీ ప్రభుత్వం 10.40 కోట్ల రూపాయల సబ్సిడీ అందించిందని నేను తెలిపారు.జిల్లాలో నూతనంగా 43589 కొత్త రేషన్ కార్డు జారీ చేసి 162000 యూనిట్లకు అదనపుదేసిన మంజూరు చేయడం జరిగిందని, 284607 ఆహార భద్రత కార్డులలో 9709656 యూనిట్ల గాను ప్రతి మాసము 5826 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.వానాకాలంలో 16865 రైతుల నుండి 87734 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించి 209 కోట్ల రూపాయలను రైతులు ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు.2025-26 ఆర్థిక సంవత్సరం డిసెంబర్ నాటికి 16 కోట్ల 25 లక్షలు మార్కెట్ ఫీజు లక్ష్యము నిర్ణయించగా 826.56 లక్షలు మార్కెట్ ఫీజును సాధించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాల ద్వారా 47447 మంది రైతుల నుండి పత్తిని కొనుగోలు చేసి కనీసం మద్దతు ధరను ఆయన అన్నారు. నేషనల్ అగ్రికల్చరల్ మారెక్టింగ్ పథకంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలలో ఆన్ ఆన్ లైన్ ద్వారా క్రయవిక్రయాలు చేయడానికి అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరానికి 2500 ఎకరాల్లో లక్ష్యానికి గాను ఇప్పటివరకు 453 మంది రైతులు 1356 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 91 లక్షల 38 వీళ్ళ ఖర్చుతో 100% సబ్సిడీతో 1 కోటి 8 లక్షల చేప పిల్లలను 617 చెరువులో వదలడం జరిగింది అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో భాగంగా జిల్లాలో 1062 పాఠశాలలకు గాను 924 పాఠశాలలో 18 కోట్ల 80 లక్షల వ్యయంతో పనులు పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్న భోజనం పథకం ద్వారా 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు 93151 విద్యార్థిని విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలతో పాటు రెండు జతల ఏకరూప దుస్తులను పంపిణీ చేయడం జరిగింది అన్నారు.షెడ్యూల్ కులాల సేవా సహకార అభివృద్ధి శాఖ ద్వారా 739840 రూపాయలతో 13 బోర్డు డ్రిల్లింగ్ చేయించి బోరు బావులకు కరెంటు పంపుసెట్లను ఉచితంగా అందించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. మైనార్టీ అభివృద్ధి శాఖ ద్వారా మహిళలకు కుట్టు మిషన్లు, ఈద్గా, స్మశాన వాటికలకు ప్రహరీ గోడ షాది ఖానాలు, చర్చిల మరమ్మత్తులను చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు,గురుకులాలు,ప్రభుత్వ వసతి గృహాలు, రెవెన్యూ కార్యాలయాలకు రంగులు వేయించి సుందరీకరణ చేయబడిందని అదేవిధంగా ప్రభుత్వ వసతి గృహాల్లో బాత్రూంలో టాయిలెట్ల మరమతులతో పాటు సీలింగ్ ఫ్యాన్లు, వంట సామాగ్రిని సమకూర్చడం జరిగిందని, చలి తీవ్రతం దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు స్వెటర్లను అందించడం జరిగినది కలెక్టర్ తెలిపారు.భూభారతి పథకంలో 21581 దరఖాస్తులు వచ్చాయని అందులో 15328 దరఖాస్తులు పరిష్కరించగా 6253 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి కలెక్టర్ తెలిపారు.మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో 1129 అంగన్వాడి కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా ప్రతిరోజు ఉదయికించిన కోడిగుడ్డు, సంపూర్ణ భోజనం, గర్భిణీ మహిళలు, బాలింతలకు ప్రతిరోజు ఉడికించిన కోడిగుడ్డు, పాలు అందించడం జరుగుతుందని అదేవిధంగా 7 నెలల నుండి 3 సంవత్సరాల లోపు నెలకు సరిపడే బాలామృతం, కోడిగుడ్లను ఇవ్వడం జరుగుతుంది కలెక్టర్ తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 12780 సంఘాలకు 43.77 కోటరూపాలు వడ్డీ లోని రుణాలను ఇవ్వడం జరిగిందని అదేవిధంగా 12856 మహిళా సంఘాలకు 658.75 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ ఇచ్చి రాష్ట్రంలో అన్ని జిల్లాల కంటే ముందుగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు. స్త్రీనిధి ద్వారా 31 కోట్ల రూపాయల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 803 సంఘాలకు 17.71 కోట్ల రుణాలు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. చేత పెన్షన్ ద్వారా 108086 మంది లబ్ధిదారులకు ప్రతి నెల 26 కోట్ల 75 లక్షల రూపాయలు చెల్లించబడుతున్నాయని ఆయన అన్నారు. జిల్లా పరిధిలో గల అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఈ సంవత్సరం 4 లక్షల 28 వేల మంది అవుట్ పేషెంట్లకు సేవలు అందించడం జరుగుతుందని, 9966 మంది గర్భిణీలకు ప్రభుత్వ ఆసుపత్రులలో వాస్తవాలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ ద్వారా 141418 మంది రోగులకు వివిధ రకాల రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయడం జరిగిందని, ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ డే కేర్ సెంటర్ ను ప్రారంభించి 26 మంది క్యాన్సర్ రోగులకు కీమోథెరపీ చేయడం అయ్యిందని, వృద్ధుల సంరక్షణ కొరకు ప్రత్యేకంగా 20 పడకలను కేటాయించి చికిత్స చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో అదనంగా కొడంగల్ వైద్య కళాశాల, భవనాల నిర్మాణం కోసం 124.50 కోట్ల రూపాయల బడ్జెట్ను కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు జిల్లాలో రోడ్ల విస్తరణతో పాటు వంతెనలు ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో అధిక పాల ఉత్పత్తికి గాను 37 లక్షల 50 వేల విలువ గల 10 టన్నుల హైబ్రిడ్ జాతి గడ్డి విత్తనాలు 75 శాతం సబ్సిడీపై పంపిణీ చేయబడ్డాయని కలెక్టర్ తెలిపారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఇప్పటివరకు 31695 మంది పేదల చికిత్స నిమిత్తం 86 కోట్ల 29 లక్షల రూపాయలను చెల్లించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకం కింద 3 వేల 2 వందల లబ్ధిదారులకు 32 కోట్ల రూపాయలు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు.వన మహోత్సవ వివిధ శాఖల సహకారంతో అటవీ శాఖ ద్వారా 47.86 నాటినట్లు కలెక్టర్ తెలిపారు పది కోట్ల రూపాయలతో అనంతగిరి కోర్ట్ పల్లి గుట్లపల్లి అంతారం బొమ్రాజ్ పెట్ జాఫర్ పల్లి లలో అర్బన్ పార్కులు మంజూరు చేయడం జరిగిందని వీటిలో అనంతగిరి అర్బన్ పార్క్ పనులు 80% పూర్తి అయ్యాయని కలెక్టర్ తెలిపారు.వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు వివిధ సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహిం చారు.రోడ్డు వారోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాలపై నిర్వహించిన అవగాహన, అదేవిధంగా నేరస్థులను పసిగట్టే డాగ్ స్క్వాడ్ ప్రదర్శన ఎంతగానో ఆకర్షించబడ్డాయి .ఉత్తమ సేవలు అందించిన అధికారు లకు, ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు.గణతంత్ర దినోత్సవ వేడుకల్లో శాసనసభ్యులు కాలే యాదయ్య, బి.మనోహర్ రెడ్డి, అదనపు కలెక్టర్ లు రాజేశ్వరి, సుధీర్ లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ రక్షణ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం గణతంత్రం ను స్ఫూర్తి గా తీసుకోవాలి

డాక్టర్ స్వర్ణకుమారి



**ఖమ్మం,జనవరి 26:( సమయం న్యూస్ )** నేటి గణతంత్రం దినోత్సవాన్ని స్ఫూర్తి గా తీసుకొని మనం రాజ్యాంగ రక్షణ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమాలు చేపట్టాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్. స్వర్ణకుమారి పిలుపునిచ్చారు.సోమవారం భారత గణతంత్ర దినోత్సవంను పురస్కరించుకొని వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను డాక్టర్. స్వర్ణకుమారి ఆవిష్కరించి , ప్రసంగించారు. అన్ని వర్గాల అభివృద్ధి ,సంక్షేమాన్ని ఆశించి , ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేశారని , అలాంటి రాజ్యాంగాన్ని నేటి పాలకులు తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పాలకులు అవలంబిస్తున్న విధానాల పట్ల బహుజనులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. వీళ్ళ నుండి మన రాజ్యాంగాన్ని మన ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడంతో పాటు పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలో అత్యధిక సంఖ్యాకులైన బహుజనులు పాలకులుగా అవతరించినప్పుడే మన సమస్యలు పరిష్కారం చెందుతాయన్నారు. ఆనాడే గణతంత్ర దినోత్సవ లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. అప్పుడే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు నిజమైన నివాళి ఇప్పించిన వారవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరానారి మండల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి , న్యాయ సలహాదారులు షేక్. నజీమా , గౌరవ సలహాదారులు పి. నాగయ్య , ఉపాధ్యక్షురాలు బి.జ్యోతి, జిల్లా ప్రధాన కార్యదర్శి స్పందన , జిల్లా కార్యదర్శి షరీఫా బేగం , సహాయ కార్యదర్శి జాన్ బి, అధికార ప్రతినిధి బి. త్రివేణి , ఆఫీస్ ఇంచార్జి కృష్ణవేణి , బహుజన చేసి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు దాసరి శ్రీనివాస్ , తిరుపతి ,పి.నాగేశ్వరావు , పమ్మీ రవి, జంకిపల్లి రవి, సర్దార్ డి .నాగేశ్వరావు ,శ్రీనివాసచారి, దారా సంజీవరావు ,సురభి నాయక్ ,వీరన్న నాయక్, రవీందర్ నాయక్ , భవాని ,లక్ష్మీ ,అఖిల్ ,రామకృష్ణ , విజయ , యోనా, లింగయ్య, కవిత, శ్రీదేవి ,లతా, స్వాతి, సంధ్య, రాజేష్, రాంబాబు, నాగేంద్ర ,శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు






**చేవెళ్ల,జనవరి 26(సమయం న్యూస్):** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అంగరంగ వైభవంగా త్రివర్ణ పండుగను జరుపుకున్నారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వో ఎండి అన్వర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎం పీడీవో అపర్ణ,ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, పోలీస్ స్టేషన్లో ఎస్సై సతీష్ త్రివర్ణ పథకావిష్కరణ గావిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈరోజు మన భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు కాబ ట్టి మనము గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నామని భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శమని రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడు గౌరవించేలా నడుచుకోవాలని కొనియాడారు.ప్రజా ప్రతినిధులు,వివిధ కార్యాలయఅధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

తాళ్లపల్లిలో: తాళ్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కందికంటి స్వాతి మాణిక్యం గౌడ్ త్రివర్ణ పతాన్ని ఘనంగా ఆవిష్కరించారు. తదనంతరం తాళ్లపల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో జెండా ఆవిష్కరణలో పాల్గొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎల్లప్పుడూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని పాఠశాలకు ఏ అవసరం ఉన్నా తప్పకుండా పరిష్కరిస్తానని విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తానని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ , అక్కముల ఆంజనేయులు,వార్డు సభ్యులు, యువజన సంఘాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగర్ గూడ. శ్రీ చైతన్య హై స్కూల్ లో, కరస్పాండెంట్ ప్రసాద్ కుమార్, శిరీష, ప్రిన్సిపల్ శ్రీరాములు, సుశాంత్ , ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగాజరుపుకున్నారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా బొక్క వేణుగోపాల్ సామాజికవేత్త, స్వాతి మేడం, సత్య సాయి సేవ ట్రస్ట్ , పరమేశ్వరి మేడం త్రినేత్ర సేవా ట్రస్ట్ , నాగర్గూడ సర్పంచ్ బండ స్వరూప మహేందర్ గౌడ్, ఉప సర్పంచ్ గుర్రపు వేణు, వార్డు మెంబర్లు ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు.

- జాతీయ జెండా ని ఆవిష్కరించిన సర్పంచ్ సంపూర్ణ రాములు గారు..



**చేవెళ్ల, జనవరి 26, (సమయం న్యూస్):** మొయినాబాద్ మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.. ముందుగా గ్రామ సెక్రెటరీ రామకృష్ణ , ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం దగ్గర ఏర్పాటుచేసిన జాతీయ జెండాని ఆవిష్కరించిన గ్రామ సర్పంచ్ సంపూర్ణ రాములు.తదంతరం గ్రామ ప్రభుత్వ పాఠశాలో ప్రిన్సిపాల్ నారాయణ , జాతీయ జెండాని గ్రామ సర్పంచ్ సంపూర్ణ రాములు ఆవిష్కరించడం జరిగింది... ఈ సందర్భంగా గ్రామ సర్పంచి మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుతూ.. గ్రామంలో ఉన్న గొప్ప,పేద తేడా లేకుండా ప్రతి ఒక్కరు తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలకి పంపించాలని.. ప్రభుత్వ పాఠశాలని చిన్నచూపు చూడొద్దని ప్రైవేట్ పాఠశాల కన్నా ప్రభుత్వ పాఠశాలలోనే చదువు నాణ్యతతో నేర్పుతారని గుర్తు చేశారు.. ఈ సందర్భంగా పాఠశాల యజమానికి హామీ ఇస్తూ మళ్లీ సంవత్సరం కల్లా పాఠశాలకి పెయింట్ వేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ రామకృష్ణ ,స్కూల్ ప్రిన్సిపాల్ నారాయణ ,స్కూల్ టీచర్ జ్యోతి , ఉప సర్పంచ్,వార్డు సభ్యులు గ్రామ ప్రజలు,యువకులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ బోల్తా వ్యక్తి మృతి

కొడంగల్ ఎస్సై జి.వి.సత్యనారాయణ

**కొడంగల్ మండలం, జనవరి,26(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని ఉడిమేశ్వరం గ్రామంలో ట్రాక్టర్ తో వరి దుక్కి చదును చేస్తుండగా బోల్తా పడి వ్యక్తి మృతి కొడంగల్ ఎస్సై జి. వి. సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చిన్న దస్తప్ప వయసు 36 ఉడుమేశ్వరం గ్రామానికి చెందిన అంజిలప్ప పొలాన్ని చదును చేస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడింది ఈ సంఘటనలో దస్తప్ప అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య శ్యామల నలుగురు పిల్లలు ఉన్నారు మృతుడి సోదరుడు శ్రీనివాస్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.వి సత్యనారాయణ తెలిపారు.

# భారత్, పాక్ మ్యాచ్‌పై సందిగ్ధం



మరో రెండు వారాల్లో టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుంది. ఈ మేరకు ఇప్పటికే అన్ని జట్లు తమ స్క్వాడ్‌లతో సిద్ధమయ్యాయి. అయితే, బంగ్లాదేశ్ జట్టు మాత్రం ఈ మెగా టోర్నీ నుంచి తప్పుకుంది. ఇక అప్పటి నుంచి పాకిస్తాన జట్టు వింత ప్రకటనలతో టెన్షన్ పెంచుతోంది. ఇప్పటికే బంగ్లాకు మద్దతుగా టోర్నమెంట్ నుంచి తప్పుకుంటామని పుకార్లు రేకెత్తించడం, ఆపై ఐసీసీ హెచ్చరించడంతో కామ్‌గా స్క్వాడ్‌ను ప్రకటించింది. ఆ తర్వాత మరో కొత్త డ్రామకు తెరలేపింది. ఇప్పటికే బంగ్లాకు మద్దతు పలికి తలనొప్పులు తెచ్చుకున్న పాక్ జట్టు.. ఇప్పుడు సరికొత్త డ్రామకు ప్లాన్ చేసింది. ఫిబ్రవరి 15న భారత జట్టుతో జరగబోయే మ్యాచ్ నుంచి తప్పుకుంటామని, ఆ మ్యాచ్‌ను బహిష్కరించే ప్లాన్ చేస్తోందని వార్తలు వినిపిస్తున్నాయి. పాకిస్తాన్ మీడియా నివేదికల మేరకు పీసీబీ చెర్మన్ మొహ్సిన్ నఖ్వీతోపాటు పాక్ ప్రధాని సాబాజ్ షరీఫ్ జరపబోయే సమావేశంలో దీనిపై ఓ నిర్ణయానికి రానున్నట్లు తెలుస్తోంది. బంగ్లాకు మద్దతు తెలిపేందుకే ఇలాంటి నిర్ణయానికి ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్, పాక్ మ్యాచ్ ఫిబ్రవరి 15న శ్రీలంకలో జరగాల్సి ఉంది. అయితే, పాకిస్తాన్ ఈ మ్యాచ్ నుంచి తప్పుకుంటే, ఐసీసీకి భారీగా ఆర్థిక నష్టం కలగనుంది. ఎందుకంటే, భారత్ వర్సెస్ పాక్ మ్యాచ్ నుంచే ఐసీసీకి భారీగా డబ్బులు సమకూరనున్నాయి. టీ20 ప్రపంచకప్ ఫైనల్, సెమీస్ కంటే కూడా ఈ రెండు జట్లు ఢీ కొనబోయే మ్యాచ్‌లకే భారీగా రేటింగ్ రానుంది. దీనిని ఐసీసీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. మరి ఇలాంటి మ్యాచ్ విషయంలో పాక్ నిర్ణయంతో ఐసీసీ తీవ్రంగా పరిగణించే ఛాన్స్ ఉంది. కఠిన చర్యలు తీసుకోవచ్చు అని తెలుస్తోంది. బంగ్లాదేశ్ జట్టు టీ20 ప్రపంచకప్ 2026 నుంచి తప్పుకున్నప్పటి నుంచి పీసీబీతోపాటు పాక్ మాజీ ఆటగాళ్లు వింత ప్రకటనలతో వివాదాలు సృష్టిస్తున్నారు. బంగ్లాకు మద్దతుగా పాకిస్తాన్ జట్టు కూడా టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకోవాలని మాజీ కెప్టెన్ రషీద్ ఖాన్ సూచించాడు. పాక్ జట్టు తప్పుకుంటే, ఐసీసీతో పాటు భారత్‌కు భారీ నష్టమంటూ తెలిపాడు. ఈ క్రమంలో తాజాగా పాకిస్తాన్ టీం భారత్‌తో మ్యాచ్ నుంచి తప్పుకోవాలని వార్తలు వినిపిస్తున్నాయి. షాబాజ్, మొహ్సిన్ నఖ్వీల మధ్య సమావేశం తర్వాత పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ ఎలాంటి నిర్ణయం తీసుకోనుందో చూడాలి.

# మరో అమ్మాయితో చాహల్ డేటింగ్



టీమ్ ఇండియా స్టార్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ వ్యక్తిగత జీవితం మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ధనశ్రీ వర్మతో విడాకుల తర్వాత, చాహల్ డేటింగ్ పుకార్లు నెట్టింట షేక్ చేస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. ఈ స్పిన్నర్ పేరు ఒక బిగ్ బాస్ బ్యూటీతో ముడిపడి ఉండటం ఇప్పుడు చర్చనీయాంశమైంది. గత కొంతకాలంగా చాహల్ రిలేషన్‌షిప్ స్టేటస్‌పై సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆర్‌జే మహవాష్‌తో బ్రేకప్ వార్తల తర్వాత, కొత్త పేరు తెరపైకి వచ్చింది. 2025లో ధనశ్రీ వర్మతో విడాకులు తీసుకున్న తర్వాత చాహల్ ఒంటరిగా ఉంటున్నారు. ఆ తర్వాత ఆర్‌జే మహవాష్‌తో చాహల్ సన్నిహితంగా ఉన్న ఫోటోలు వైరల్ అయ్యాయి. అయితే, ఇటీవల వీరిద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడంతో వీరి మధ్య బంధం ముగిసిందనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం చాహల్ పేరు “బిగ్ బాస్ 13” ఫేమ్, ప్రముఖ జర్నలిస్ట్ షెఫాలీ బగ్గాతో వినిపిస్తోంది. వీరిద్దరూ కలిసి ఉన్న ఒక వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. అందులో ఇద్దరూ బ్లాక్ డ్రెస్ ధరించి కనిపించారు. వీరిద్దరూ పక్కపక్కనే లేకపోయినప్పటికీ, ఒకే వేదికపై కనిపించడంతో వీరి మధ్య ఏదో నడుస్తోందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతానికి షెఫాలీ బగ్గా లేదా యుజ్వేంద్ర చాహల్ ఈ వార్తలపై ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. చాహల్ తన క్రికెట్ కెరీర్‌తో పాటు వ్యక్తిగత కారణాల వల్ల నిరంతరం వార్తల్లో నిలుస్తున్నారు. మునుపటి రిలేషన్స్‌పై వచ్చిన వార్తల లాగే, ఇది కూడా కేవలం పుకారు మాత్రమేనా లేక నిజంగానే కొత్త అధ్యాయం మొదలైందా అనేది కాలమే నిర్ణయించాలి. క్రీడాకారుల వ్యక్తిగత జీవితాలపై ఆసక్తి చూపడం సహజమే అయినా, అధికారిక ధృవీకరణ వచ్చే వరకు వీటిని కేవలం ఊహాగానాలుగానే పరిగణించాలి. చాహల్ అభిమానులు మాత్రం ఆయన త్వరగా స్థిరపడాలని కోరుకుంటున్నారు.

# జట్టు ఎంపికలో నిలకడ ఉండాలి

## ఆటగాళ్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయొద్దు

## టీమ్ ఇండియా సీనియర్ స్పిన్నర్ అశ్విన్

భారత తుది జట్టు ఎంపికపై సర్వత్రా చర్చ నడుస్తోంది. తాజాగా టీమ్ ఇండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఈ విషయంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జట్టులో ఒక కీలక ఆటగాడిని పక్కన పెట్టడం అంటే అది ‘సర్కస్ ఫీట్’ చేయడమేనని, అటువంటి సాహసాలు జట్టుకు నష్టం కలిగిస్తాయని అశ్విన్ హెచ్చరించారు. ప్రస్తుత న్యూజిలాండ్ పర్యటనలో వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ వరుసగా విఫలమవుతుండటంతో అతనిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గత మ్యాచ్‌లలో తక్కువ స్కోరుకే అవుట్ అవ్వడంతో, మూడో టీ20లో అతని స్థానంలో ఇషాన్ కిషన్‌ను తీసుకోవాలని చాలామంది మాజీలు సూచిస్తున్నారు. అయితే, అశ్విన్ మాత్రం దీనికి భిన్నంగా స్పందించారు. ఒకట్రెండు మ్యాచ్‌లలో విఫలమైనంత మాత్రాన శాంసన్ వంటి ప్రతిభావంతుడైన ఆటగాడిని పక్కన పెట్టడం సరైన నిర్ణయం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. తన యూట్యూబ్ ఛానెల్ ద్వారా అశ్విన్ మాట్లాడుతూ.. “టీమ్ ఇండియా జట్టు ఎంపికలో నిలకడ ఉండాలి. ఒక ఆటగాడికి అవకాశం ఇచ్చినప్పుడు అతనికి తగినన్ని అవకాశాలు కల్పించాలి. కేవలం ఒక ఇన్నింగ్స్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం అంటే అది సర్కస్ ఫీట్ లాంటిదే అవుతుంది. ఇలాంటి గందరగోళ పరిస్థితులు ఆటగాళ్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. న్యూజిలాండ్ వంటి కఠినమైన జట్లపై ఆడుతున్నప్పుడు జట్టులో స్థిరత్వం చాలా అవసరం” అని పేర్కొన్నారు.






# పాక్ వరల్డ్ రికార్డును సమం చేసిన భారత్

టీమిండియా దూకుడు చూస్తుంటే రికార్డులన్నీ గల్లంతు కావాల్సిందే అనిపిస్తోంది. గౌహతి వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి, 5 మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0తో కైవసం చేసుకుంది. అయితే ఈ విజయం కేవలం భారత్‌కు సిరీస్‌ను మాత్రమే అందించలేదు, పొరుగు దేశం పాకిస్థాన్‌కు పెద్ద టెన్షన్ మొదలయ్యేలా చేసింది. గత 8 ఏళ్లుగా పాక్ పేరిట ఉన్న ఒక అరుదైన రికార్డును భారత్ ఇప్పుడు సమం చేయడమే ఇందుకు కారణం.గౌహతిలో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ నిర్దేశించిన 154 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం 10 ఓవర్లలోనే ఊదేశింది. ఈ అద్భుత విజయంతో టీమిండియా వరుసగా 11వ టీ20 సిరీస్‌ను తన ఖాతాలో వేసుకుంది. గతంలో పాకిస్థాన్ జట్టు 2016 నుంచి 2018 మధ్య కాలంలో వరుసగా 11 టీ20 సిరీస్‌లు గెలిచి ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇప్పటివరకు ఏ ఇతర అగ్రశ్రేణి జట్టు కూడా ఆ రికార్డు దరిదాపుల్లోకి రాలేకపోయింది. కానీ ఇప్పుడు టీమిండియా సరిగ్గా ఆ 11వ సిరీస్ మైలురాయిని తాకి పాక్ రికార్డును సమం చేసింది. మరో సిరీస్ గెలిస్తే అత్యధిక వరుస టీ20 సిరీస్‌లు గెలిచిన ఏకైక జట్టుగా భారత్ చరిత్ర సృష్టిస్తుంది. ఈ పరిణామం పాక్ అభిమానులను, ఆ దేశ బోర్డును ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం భారత్ ఉన్న ఫామ్ చూస్తుంటే ఎవరూ అడ్డుకోలేరనిపిస్తోంది. ముఖ్యంగా ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 వరల్డ్ కప్ 2026కు ముందు భారత్ ఇలాంటి భీకరమైన ఆట తీరును ప్రదర్శించడం ప్రత్యర్థి జట్లను భయపెడుతోంది. గౌహతి మ్యాచ్‌లో అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ చేసిన విధ్వంసం టీమిండియా బ్యాటింగ్ లోతును చాటిచెప్పింది. బౌలింగ్‌లో కూడా బుమ్రా, రవి బిష్ణోయ్ వంటి వారు అత్యుత్తమ ప్రదర్శనతో కివీస్ పతనాన్ని శాసించారు. వరల్డ్ కప్‌లో భాగంగా ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా భారత్-పాకిస్థాన్ మ్యాచ్ జరగనుంది. ఈ మెగా పోరుకు ముందు టీమిండియా రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తుంటే, అటు పాక్ జట్టు మాత్రం కెప్టెన్సీ మార్పులు, ప్లేయర్ల ఫామ్ లేమితో సతమతమవుతోంది. ఒకవేళ భారత్ తన తదుపరి టీ20 సిరీస్‌ను కూడా గెలిస్తే, పాక్ రికార్డు కాలగర్భంలో కలిసిపోతుంది. ఈ భయం పాకిస్థాన్ క్రికెట్ సర్కిల్స్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. ఛాంపియన్ తరహాలో ఆడుతున్న భారత్.. ఈసారి వరల్డ్ కప్ ఫేవరెట్‌గా బరిలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది.

# బుమ్రాకు విశ్రాంతి అవసరమా..?

## మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర ఆగ్రహం



భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న ప్రతిష్టాత్మక టీ20 సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్‌కు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను పక్కన పెట్టడంపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. “వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్” పేరుతో జట్టు యాజమాన్యం తీసుకుంటున్న నిర్ణయాలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఆయన ధ్వజమెత్తారు. బుమ్రా ఇప్పుడే సుదీర్ఘ విరామం తర్వాత జట్టుతో కలిశారని, కేవలం ఒక మ్యాచ్ ఆడిన వెంటనే అలసిపోయేంత పనిభారం ఏముందని సూటిగా ప్రశ్నించారు. కీలకమైన సిరీస్ జరుగుతున్నప్పుడు ప్రధాన బౌలర్‌కు విశ్రాంతి ఇవ్వడం వల్ల జట్టు సమతుల్యత దెబ్బతింటుందని, ఇది అభిమానులను నిరాశకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం కోసం ఆడే మ్యాచ్‌ల కంటే ఐపీఎల్ లేదా ఇతర లీగ్‌లకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఒక ఫాస్ట్ బౌలర్ రిథమ్ అందుకోవాలంటే వరుసగా మ్యాచ్‌లు ఆడాలని, ఇలా విడతలవారీగా ఆడిస్తే ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీల్లో ఇబ్బందులు తప్పవని కైఫ్ హెచ్చరించారు. బుమ్రా ఫిట్‌నెస్ గురించి మాట్లాడుతూ కైఫ్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “అసలు దేనికి విశ్రాంతి? ఏం పని చేశారని ఒత్తిడి అంటున్నారు? మైదానంలో దిగి వికెట్లు తీస్తేనే ఆత్మవిశ్వాసం వస్తుంది. నెట్స్‌లో ఎంత సేపు బౌలింగ్ చేసినా మ్యాచ్ ప్రాక్టీస్ లేకపోతే ప్రయోజనం ఉండదు” అని ఆయన తేల్చిచెప్పారు. సీనియర్లు లేకపోవడం వల్ల యువ బౌలర్లపై అదనపు భారం పడుతుందని, అది వారి ప్రదర్శనపై ప్రభావం చూపుతుందని విశ్లేషించారు. జట్టు యాజమాన్యం మాత్రం రాబోయే టెస్ట్ సిరీస్‌ను దృష్టిలో ఉంచుకుని బుమ్రాను రొటేషన్ పద్ధతిలో వాడుతున్నట్లు తెలుస్తోంది. అయితే కైఫ్ ఈ వాదనను పూర్తిగా తప్పుబట్టారు. గతంలో కూడా ఇలాంటి ప్రయోగాల వల్లే కీలక సమయాల్లో టీమిండియా చేతులెత్తేసిందని గుర్తు చేశారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్లు ఆడుతున్నప్పుడు కేవలం బౌలర్లకు మాత్రమే ఎందుకు ఆంక్షలు విధిస్తున్నారని ఆయన నిలదీశారు. సోషల్ మీడియాలో కూడా కైఫ్ వ్యాఖ్యలకు అనూహ్య స్పందన లభిస్తోంది. సొంతగడ్డపై సిరీస్ గెలవాల్సిన సమయంలో ఇలాంటి నిర్ణయాలు సరికాదని క్రికెట్ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. బుమ్రా లేని లోటు బౌలింగ్ విభాగంలో స్పష్టంగా కనిపిస్తోందని, కివీస్ బ్యాటర్లను కట్టడి చేయడంలో భారత బౌలర్లు తడబడుతున్నారని విశ్లేషకులు అంటున్నారు. ఈ వివాదంపై టీమ్ మేనేజ్‌మెంట్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# వైభవ్ సూర్యవంశీపై యువీ బోల్డ్ ప్రిడిక్షన్

కేవలం 14 ఏళ్ల వయసులోనే తన బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్‌ను ఆశ్చర్యపరిచిన యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై టీమిండియా లెజెండ్ యువరాజ్ సింగ్ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రస్తుతం జింబాబ్వే ఆతిథ్యమిస్తున్న యు19 వరల్డ్ కప్ 2026లో వైభవ్ అద్భుతంగా రాణిస్తున్నాడు. సూపర్ సిక్స్ దశలో భారత్.. జింబాబ్వే (జనవరి 27), పాకిస్థాన్ (ఫిబ్రవరి 1) జట్లతో తలపడనున్న నేపథ్యంలో ఐసీసీ సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోలో యువీ వైభవ్ గురించి తన అభిప్రాయాలను పంచుకున్నాడు. టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ సాధారణంగా ఎవరినీ అంత తొందరగా మెచ్చుకోడు. కానీ వైభవ్ సూర్యవంశీ ఆటతీరు చూశాక యువరాజ్ తనను తాను ఆపుకోలేకపోయారు. “వైభవ్ ఒక అసాధారణమైన టాలెంట్ పర్సన్. అతని ఆటలో నాకు బాగా నచ్చింది ఏమిటంటే.. భయం లేని తన సహజ సిద్ధమైన ధోరణి. నెట్స్‌లో వేగంగా వచ్చే బౌన్సర్లను అతను ఎదుర్కొంటున్న తీరు అద్భుతం. మెడ దగ్గరకు వచ్చే బంతులను కూడా హుక్ లేదా పుల్ షాట్లు ఆడటానికి అతను ఏమాత్రం సంకోచించడం లేదు. పెద్ద జట్లపై కూడా అతను ఇలాగే స్థిరంగా ఆడితే, భారత్‌కు ఒక గొప్ప ఆటగాడు దొరికినట్లే” అని యువరాజ్ సింగ్ ప్రశంసించారు. వైభవ్ సూర్యవంశీ ఇప్పటికే తన పేరిట అనేక రికార్డులను లిఖించుకున్నాడు. 2025 ఏప్రిల్‌లో కేవలం 14 ఏళ్ల వయసులోనే రాజస్థాన్ రాయల్స్ తరపున ఐపీఎల్ అరంగేట్రం చేసిన అతను, గుజరాత్ టైటాన్స్‌పై కేవలం 35 బంతుల్లోనే సెంచరీ బాది చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలో సెంచరీ చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా, భారత్ తరపున అత్యంత వేగవంతమైన ఐపీఎల్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా నిలిచాడు. ఆ సీజన్‌లో 252 పరుగులు చేసి సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్ అవార్డును కూడా అందుకున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న యు19 వరల్డ్ కప్‌లో కూడా వైభవ్ తన జోరును కొనసాగిస్తున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన గత మ్యాచ్‌లో కేవలం 23 బంతుల్లోనే 40 పరుగులు చేసి భారత్‌కు శుభారంభాన్ని ఇచ్చాడు. ఆయుష్ మాత్రే నేతృత్వంలోని భారత జట్టు ఇప్పుడు సూపర్ సిక్స్ దశలోకి అడుగుపెట్టింది. ఈ దశలో వైభవ్ బ్యాటింగ్ కీలకం కానుంది. కేవలం 14 ఏళ్లకే అటు ఐపీఎల్‌లో, ఇటు అంతర్జాతీయ వేదికలపై రికార్డుల వేట సాగిస్తున్న వైభవ్ గురించి యువరాజ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





# రవితేజ కొత్త మూవీ ఇరుముడి

మాస్ మహారాజ్ రవితేజ కెరీర్ గత కొన్నేళ్లుగా ఆశించిన స్థాయిలో సాగడం లేదు. వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ, ప్రేక్షకుల్లో ఆ సినిమాలు పూర్తి సంతృప్తిని కలిగించలేకపోయాయి. మాస్ ఇమేజ్‌కు కాస్త విరామం ఇచ్చి, క్లాస్ టచ్‌తో చేసిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కూడా సంక్రాంతి బరిలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దీంతో రవితేజ తదుపరి ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ క్రమంలోనే ఆయన దర్శకుడు శివ నిర్వాణతో చేతులు కలిపారు. ఈ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. అయ్యప్ప స్వామి మాలధారణలో రవితేజ కనిపించిన లుక్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంది. పోస్టర్ చూసిన వెంటనే ఒక డివోషనల్ ఫీల్, పాజిటివ్ వైబ్స్ కలుగుతున్నాయన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయ్యప్ప మాలధారణలో ఇరుముడికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఈ సినిమాలో ఎమోషనల్‌గా, డీప్‌గా చూపించబోతున్నారని సమాచారం. సెన్సిటివ్, క్లాస్ కథనాలతో పేరు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈసారి డివోషనల్ టచ్‌తో కథను తెరకెక్కిస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. మాస్‌కు భిన్నంగా, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా ద్వారా రవితేజ కొత్త ఇమేజ్‌ను ఆవిష్కరించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి జీ.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. 'ఇరుముడి' రవితేజ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్నది అభిమానుల్లోనూ ఆసక్తి పెరుగుతోంది.



# సెలెక్టెడ్‌గానే ఐటమ్ సాంగ్స్ చేస్తా

ఒకప్పుడు సినిమాల్లో ఐటం పాట అంటే ప్రత్యేకంగా ప్రొఫెషనల్ డాన్సర్లే గుర్తొచ్చేవారు. ఆ పాటల్లో వాళ్లు కనిపిస్తేనే హిట్ అనే స్టాండర్డ్ ఉండేది. కానీ కాలం మారింది. ఇప్పుడు అదే సినిమాలో హీరోయిన్‌గా నటించిన నటీమణులే ఐటం సాంగ్స్‌లోనూ స్టెప్పులేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఒకే సినిమాలో హీరోయిన్ పారితోషికంతో పాటు స్పెషల్ సాంగ్ ఫీజు కూడా అందుకుంటూ డబుల్ లాభం పొందుతున్నారు. ఈ ట్రెండ్‌కు అనుగుణంగానే గత కొన్నేళ్లుగా సమంత, కాజల్ అగర్వాల్, తమన్నా, పూజా హెగ్డే, శ్రీలీల వంటి స్టార్ హీరోయిన్లు ఐటం పాటల్లో కనిపించి సెన్సేషన్ క్రియేట్ చేశారు. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ ఇదే ట్రెండ్ బలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా పెద్ద సినిమాల్లో ఐటం సాంగ్ అంటే స్టార్ హీరోయిన్ ఉండాల్సిందే అనే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే 'నేషనల్ క్రష్'గా గుర్తింపు పొందిన రష్మిక మందన్నా కూడా ఈ దారిలోకి అడుగుపెట్టింది. బాలీవుడ్ డెబ్యూ 'గుడ్‌బై'లో నటిగా మెప్పించిన ఆమె, తర్వాత వచ్చిన 'థామా' చిత్రంలో నటనతో పాటు స్పెషల్ సాంగ్‌లోనూ తనదైన స్టైల్‌లో ఆకట్టుకుంది. ఆ పాట తర్వాత రష్మికపై ఐటం భామగా కూడా డిమాండ్ పెరిగింది. దర్శక, నిర్మాతలు 'హీరోయిన్‌గా తీసుకున్నా, ఐటం సాంగ్‌కు కూడా ఒప్పించొచ్చు' అనే ధీమాతో ఆమె వైపు చూస్తున్నారనే టాక్ వినిపించింది. కానీ ఇదే సమయంలో రష్మిక ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాను నటిగా అయినా, ఐటం భామగా అయినా కేవలం ఇద్దరు దర్శకుల సినిమాల్లో మాత్రమే స్పెషల్ సాంగ్స్ చేస్తానని, అంతకుమించి ఈ విషయంలో చాలా సెలెక్టివ్‌గా ఉంటానని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రష్మికపై భారీ ఆశలు పెట్టుకున్న కొంతమంది దర్శకులు ఈ షరతులతో కాస్త నిరాశకు గురైనట్లు సమాచారం. తెలుగులో లేడీ ఓరియెంటెడ్ సినిమా 'మైసా'లో కీలక పాత్రలో నటిస్తుండగా, విజయ్ దేవరకొండ 14వ సినిమాలోనూ హీరోయిన్‌గా ఎంపికైంది. మరోవైపు బాలీవుడ్‌లో 'కాక్‌టెయిల్ 2' వంటి పెద్ద ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. నటిగా, డాన్సర్‌గా తనను తాను విభిన్నంగా ప్రెజెంట్ చేసుకుంటూనే, అవసరమైతేనే ఐటం పాటలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలన్నదే రష్మిక స్ట్రాటజీగా కనిపిస్తోంది.




# తరుణ్ భాస్కర్ ఓం శాంతి శాంతి శాంతిః

తనపై పెత్తనం చెలాయించే భర్తకి ఓ భార్య ఎలా బుద్ధి చెప్పింది.. అతడి అహంకారాన్ని ఎలా అణిచింది అనే నేపథ్యంలో సాగే కథ 'ఓం శాంతి శాంతి శాంతిః'. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా జంటగా నటించిన ఈ సినిమాని ఏఆర్ సజీవ్ తెరకెక్కించారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ సంస్థలు నిర్మించాయి. బ్రహ్మాజీ, సురభి ప్రభావతి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. జనవరి 30న థియేటర్లలోకి రానుంది.

# మరోసారి పోలీసు అధికారిగా.. రాణిముఖర్జీ



మహిళల అక్రమ రవాణా.. కిడ్నాప్ లాంటి అంశాలతో రూపొంది మంచి హిట్ బొమ్మ అనిపించుకున్నాయి 'మర్దానీ' చిత్రాలు. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్‌ఫిల్మ్స్ నిర్మించిన ఈ సినిమాలు ఇప్పటికే రెండు భాగాలుగా విడుదలై ప్రేక్షకుల్ని మెప్పించాయి. తాజాగా ఈ ఫ్రాంఛైజీలో 'మర్దానీ 3' రాబోతోంది. రాణి ముఖర్జీ మరోసారి పోలీసు అధికారిణి శివానీ రాయ్ పాత్రలో కనిపించనున్నారు. జనవరి 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



# చిత్రపరిశ్రమకు వచ్చే వారిని ప్రోత్సహించాలి

## ఇక్కడ కాస్ట్ కౌచింగ్ అంటూ ఏదీ లేదు



సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి పనిచేస్తానని ఏ ఆడబిడ్డ, మగబిడ్డ అయినా అంటే వారిని ప్రోత్సహించి పంపాలని, తెలుగు సినీ ఇండస్ట్రీ గొప్పదని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. జీవితాంతం ప్రేక్షకులను అలరిస్తూనే ఉంటానని తెలిపారు. ఆయన కీలక పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు' భారీ విజయాన్ని అందుకుని రూ.300 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. ఈ సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభలో చిరంజీవి మాట్లాడారు. మళ్లీ విజయోత్సవాలను జరుపుకొనే వైభవాన్ని తీసుకొచ్చిన ఘనత దర్శకుడు అనిల్ రావిపూడికి దక్కుతుంది. ఇంతటి ఘన విజయాన్ని అందించిన తెలుగు సినీ ప్రేక్షకులకు ధన్యవాదాలు. సినిమా టీమ్ విజయానందాన్ని అనుభవిస్తుంటే, నాకూ సంతోషంగా ఉంది. అనిల్‌ను చూస్తుంటే రాఘవేంద్రరావుగారు గుర్తుకు వచ్చేవారు. రోజూ సెట్‌లో వినోదాన్ని పంచేవారు. ఈ మూవీ షూటింగ్‌కు వెళ్తుంటే ఎంతో ఆనందంగా ఉండేది. ప్రతి సినిమా కష్టపడి పనిచేస్తాం. కానీ, కొన్ని సినిమా ఫలితాలు ఉత్సాహాన్ని ఇస్తాయి. అలాంటిదే ఈ మూవీ. ఈ సంక్రాంతికి దాదాపు అన్ని సినిమాలను ఆదరించారు. సినిమాలో వెంకీ ఉండాలని కోరుకున్నా. దాన్ని అనిల్ సాకారం చేశాడు. ఎంత పెద్ద స్టార్‌నైనా హ్యాండిల్ చేసే సామర్థ్యం అనిల్ రావిపూడికి ఉంది. మళ్లీ అనిల్‌తో చేసే అవకాశం మా ఇద్దరిలో ఎవరికి వస్తుందో చూడాలి.' ఇక నా కుమార్తె ఇండస్ట్రీలోకి వస్తానంటే ప్రోత్సహించిన తొలి వ్యక్తి మా అబ్బాయి రామ్‌చరణ్. 'రంగస్థలం' కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పనిచేసింది. కష్టం ఒక్కటే ఆయుధమని తెలుసుకున్న వ్యక్తి నా కుమార్తె సుస్మిత. సినీ ఇండస్ట్రీ అద్దంలాంటిది. మనం ఎలా ఉంటామో అలాంటి ఫలితాన్నే ఇస్తుంది. ఎవరైనా సరే సినీ ఇండస్ట్రీలోకి వస్తానంటే వారిని ప్రోత్సహించాలన్నారు.. క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవు. నువ్వు ప్రొఫెషనల్‌గా ఉండాలి. కొత్త టాలెంట్‌కు ఎప్పుడూ ప్రోత్సాహం లభిస్తూనే ఉంటుంది. ఇందులో చేసిన ప్రతి నటుడు, సాంకేతిక నిపుణుడు ఎంతో ఉత్సాహంగా నటించారు. నయనతార సినిమాలో చేయడమే కాదు, ప్రమోషన్స్ కూడా చేసింది. ఆ మెరిట్ కూడా అనిల్‌కే దక్కుతుంది. సినిమా పరుగులు పెట్టడానికి ఎడిటర్ తమ్మిరాజు కారణం. ఇటీవల ఒకామె మాట్లాడిన వీడియో చూసి, భావోద్వేగానికి గురయ్యా. 'ఏమయ్యా.. చిరంజీవి ఎప్పటి నుంచో కష్టపడుతూనే ఉన్నావు. మమ్మల్ని ఆనందింపజేయడానికి ఓపిక ఉన్నా లేకపోయినా ఇప్పటికీ అలాగే పనిచేస్తున్నావు. డబ్బుల కోసం నువ్వు పనిచేస్తున్నావని నేను అనుకోను. నువ్వు ఇలా కష్టపడుతుంటే నాకు బాధగా ఉంది' అని అన్నారు. నిజంగా ఆ తల్లికి ఈ సభాముఖంగా ధన్యవాదాలు చెబుతున్నా. చిరంజీవి మమ్మల్ని అలరించాలనే కోరుకునే మీ పాజిటివ్ ఎనర్జీ నుంచే నాకు ఈ శక్తి వస్తోంది. ఈ జన్మ ఉన్నంత వరకూ మిమ్మల్ని అలరిస్తూనే ఉంటాను అని చిరంజీవి అన్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# బిర్యానీలో నిద్రమాత్రలు కలిపి.. దిండుతో నొక్కి

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే భర్త హత్య
- ప్రియుడు, ఆర్‌ఎంపీతో కలిసి భార్య ఘాతుకం
- బిర్యానీలో నిద్రమాత్రలు కలిపి.. ముఖంపై దిండుతో నొక్కి
- మృతుడి తండ్రి ఫిర్యాదుతో నిందితుల ఆటకట్టు
- కేసును ఛేదించిన గుంటూరు జిల్లా పోలీసులు
- మీడియాకు వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందాల్



**నగరంపాలెం (గుంటూరు):** నిద్రమాత్రల పొడిని కలిపిన బిర్యానీని భర్తకు వడ్డించి, మత్తులోకి జారుకున్నాక దారుణంగా హత్యచేసిన భార్యను, అందుకు సహకరించిన ప్రియుడిని, ఆర్‌ఎంపీని దుగ్గిరాల పోలీసులు అరెస్టుచేశారు. ఈ కేసు వివరాలను సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మీడియాకు వెల్లడించారు. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామానికి చెందిన లోకం శివనాగరాజు (48)కి 2008లో లక్ష్మీమాధురితో వివాహమైంది. వీరికి ఇద్దరు మగ పిల్లలు. శివనాగరాజుకు ఉల్లి వ్యాపారం, షేర్ మార్కెట్‌లో నష్టాలు రావడంతో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో.. భార్య లక్ష్మీమారుతి తొలుత దుగ్గిరాలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా, తర్వాత విజయవాడలోని ఓ సినిమా థియేటర్‌లో పనికి చేరింది. అక్కడి బుకింగ్ కౌంటర్‌లో పనిచేసే పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామానికి చెందిన కొండవీటి గోపీతో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. గోపీని భర్తకు పరిచయం చేయగా వీరు స్నేహితులుగా మారారు. ఈ క్రమంలో.. గతంలో హైదరాబాద్‌లో గోపీ పనిచేసిన కార్యాలయంలో డ్రైవర్‌గా చేరిన శివనాగరాజు ఇటీవల దుగ్గిరాల వచ్చాడు. భార్య, పిల్లలతో గోపీ ఓ ఫ్లాట్‌లో ఉంటున్నట్లు తెలిసి పలుమార్లు హెచ్చరించాడు. దీంతో శివనాగరాజును అడ్డు తొలగించుకోవాలని లక్ష్మీమాధురి, గోపీ నిర్ణయించుకున్నారు. గోపీ తన స్నేహితుడైన గుంటూరు జిల్లా ఫిరంగిపురం ఎర్రగుంట్లపాడుకు చెందిన ఆర్‌ఎంపీ కంభంపాటి సురేష్ వద్ద నిద్రమాత్రలు సేకరించాడు. వాటిని లక్ష్మీమాధురికి ఇవ్వగా, ఆమె వాటిని పొడిచేసి బిర్యానీలో కలిపి ఈనెల 18న భర్తకు వడ్డించింది. భర్త నిద్రలోకి జారుకున్నాక లక్ష్మీమాధురి, గోపీ, సురేష్ కలిసి శివనాగరాజు ముఖంపై దిండుతో నొక్కిపెట్టి హత్యచేశారు.

### గుండెపోటు అంటూ నాటకం..

మర్నాడు ఉదయం భర్త గుండెపోటుతో మరణించినట్లు అందరినీ నమ్మించేందుకు భార్య యత్నించింది. కానీ, శివనాగరాజు మృతిపై తండ్రి అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా భార్యను ప్రశ్నించగా.. అసలు విషయం బయటపడింది. పోలీసులు లక్ష్మీమాధురి, గోపీ, సురేష్ ను అరెస్టుచేశారు. వారి నుంచి 4 సెల్‌ఫోన్లు, మత్తుమాత్రల షీట్‌లు, అప్పడాల కర్ర, బుల్లెట్, కారు స్వాధీనం చేసుకున్నారు.

## ఐటీడీఏ ఆవరణలో ఘనంగా గణతంత్ర వేడుకలు

### జాతీయ జెండాను ఆవిష్కరించిన పీఓ రాములు

**ఆర్.కే. పురం, జనవరి 26:** కె.ఆర్. పురం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ కె. రాములు నాయక్ గారు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి రావడంతోనే భారత్ ఒక శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశంగా ఆవిర్భవించిందని గుర్తుచేశారు. డా. బాబాసాహెబ్ అంబేద్కర్ గారు అందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛను కల్పించిందని, ఆ మహనీయుల ఆశయాలను గౌరవించడం మనందరి బాధ్యతని అన్నారు. భారతదేశం నేడు అంతరిక్షం నుండి రక్షణ రంగం వరకు ప్రపంచ దేశాల సరసన అగ్రగామిగా నిలుస్తోందని రాములు నాయక్ కొనియాడారు. విద్యార్థులు, యువత క్రమశిక్షణతో కూడిన దేశభక్తిని పెంపొందించుకోవాలని, రాజ్యాంగం కల్పించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ దేశ ప్రగతికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏకి చెందిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కార్యాలయ సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు.



## గాంధీలది త్యాగాల చరిత్ర

### బిజెపికి అలాంటి చరిత్ర లేదు: జగ్గారెడ్డి

**హైదరాబాద్,ఆగస్ట్15:** స్వాతంత్ర్య ఉద్యమం సమయం లో బిజెపి పాత్ర ఏమీ లేదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్ రెడ్డి విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడి, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పూర్వికులను అడిగితే వాస్తవాలు ఏమిటో చెబుతారని ఆయన శుక్రవారం విలేకరుల సమావేశం లో అన్నారు. ఏఐసిసి అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై విమర్శలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని బిజెపి నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్యాగాల గురించి తెలియని బిజెపి నాయకులు త్యాగాల కుటుంబంపై నిందలు వేస్తున్నారని జగ్గారెడ్డి విమర్శించారు. ధర్మం గురించి మాట్లాడే బిజెపి నేతలకు వారసత్వం గురించి తెలియదా? అని ఆయన ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కుటుంబం కాశ్మీర్‌లోని బ్రాహ్మణ కుటు-ంబానికి చెందిన వారన్నారు. సోనియా, రాహుల్ గాంధీలకు ఉన్న గొప్ప గుణం బిజెపి నేతల్లో ఎవరికైనా ఉందా? అని ఆయన ప్రశ్నించారు. దేశ ప్రజలు గతంలో సోనియా గాంధీని ప్రధానిని చేయాలన్న భావనతో కాంగ్రెస్‌ను గెలిపిస్తే, సోనియా గాంధీ ఆ పదవిని తీసుకోకుండా ప్రధానిగా మన్మోహన్ సింగ్‌ను నియమించారన్నారు. త్యాగాల గురించి మీకు తెలుసా? అని ఆయన ప్రశ్నించారు. తనకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వకపోతే కొట్లాడుతానని జగ్గారెడ్డ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.




## మీ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు

- అంబటి రాంబాబు



**ఎన్టీఆర్ జిల్లా:** రెడ్‌బుక్ పేరుతో మంత్రి లోకేష్ చేస్తున్న బెదిరింపులకు ఎట్టిపరిస్థితుల్లో భయపడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఇబ్రహీంపట్నంలో సోమవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. మాజీమంత్రి జోగి రమేష్ ను అక్రమంగా 83 రోజుల పాటు జైల్లో పెట్టించి చంద్రబాబుకు ఆయనపై ఉన్న కక్ష తీర్చుకున్నారన్నారు. అయితే అన్యాయంగా జైల్లో ఉంచడంతో ప్రజల్లో ప్రస్తుతం జోగిరమేశ్‌కు క్రేజ్ పెరిగిందన్నారు. రాజకీయ కక్ష తీర్చుకోవడం కోసం ప్రభుత్వం పోలీసులను పావులుగా వాడుకుంటుందని వైస్సార్సీపీలో యాక్టివ్‌గా ఉన్న వారందరిపై కేసులు పెట్టి జైల్లో తోస్తుందన్నారు. ఇదంతా ఒక పథకం ప్రకారమే జరుగుతుందని తెలిపారు. చంద్రబాబు ఎంత హింసిస్తే వైఎస్సార్సీపీ నేతలు అంత పట్టుదలగా పార్టీ బలోపేతానికి సిద్ధపడతారని తెలిపారు. ప్రజలంతా మళ్లీ వైఎస్ జగన్‌నే సీఎంగా చూడాలనుకుంటున్నారన్నారు. ఈ విషయాన్ని స్వయంగా చంద్రబాబే పరోక్షంగా జనం సంతృప్తిగా లేరని తెలిపారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక వాటిని తప్పుదోవ పట్టించడానికి కూటమి ప్రభుత్వం అరెస్టులు చేయిస్తుందన్నారు. చంద్రబాబు , లోకేష్‌ల పోకడే వారి పతనానికి నాంధి అని ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంట నడిచిన వారు రెడ్ బుక్ పేరుతో చేస్తున్న బెదిరింపులకు భయపడతారా అని అంబటి రాంబాబు ఈ సందర్భంగా ప్రశ్నించారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు రాజకీయం చేశారని లడ్డూ కల్తీ జరిగిందని తప్పుడు ప్రచారం చేశారన్నారు. తిరుమలలో లడ్డూ తయారికీ దశలవారిగా నెయ్యిపరీక్ష చేస్తారన్న సంగతి ఆయనకు తెలియదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు తప్పును దేవుడు కూడా క్షమించడని అన్నారు. దివంగత నేత ఎన్టీఆర్‌ను మోసం చేసిన చంద్రబాబుకు ఆయన విగ్రహం పెట్టే అర్హత ఎంతమాత్రం లేదన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని వైఎస్సార్సీపీ నేతలపై కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు భవిష్యత్తులో సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని మాజీ మంత్రి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

### టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

**తిరుపతి,జనవరి26:** శేషాచలం అడవులలో ఎర్రచందనం అక్రమ రవాణా జీరో ఫెల్లింగ్ దిశగా ముందుకు వెళ్లాలని టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ సూచించారు. తిరుపతి కపిలతీర్థం వద్ద ఉన్న టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎస్పీ శ్రీనివాస్ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల ఎర్రచందనం అక్రమ రవాణా కేసులు ఎక్కువగా నమోదయ్యాయని, ఇందుకు సిబ్బంది శ్రమ ఎక్కువగానే ఉందన్నారు. టాస్క్ ఫోర్స్ కు లక్ష్యం శేషాచలం అడవుల్లో ఒక్క చెట్టు కూడా స్మగ్లర్లు నరకకుండా పూర్తిగా అదుపు చేయడానికి సమిష్టిగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. కానిస్టేబుల్ ఎన్.నారాయణకు ఉత్కృష్ట సేవా పతకాన్ని అందజేశారు. పలువురు సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు ఎండీ షరీఫ్, శ్రీనివాసరెడ్డి, ఎసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐ సాయిగిరిధర్, సీఐ ఖాదర్ బాషా, ఎస్ఐ ఎండీ రఫీ, ఆర్ఎస్ఐలు లింగాధర్, వినోద్ కుమార్, విష్ణువర్ధన్, మురళీధర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



## తమ్ముడూ పవన్ అంతలా ఊగిపోక..

### ప్రభువు మార్గంలో నడువు.. ● రెచ్చగొట్టడం అవసరమా?
### ప్రజా సమస్యలే అజెండా కావాలి ● ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్
### లడ్డూ వివాదంపై పవన్ కల్యాణ్‌కు హితవు

**అమరావతి, జనవరి 26:** 77వ గణతంత్ర దినోత్సవ వేళ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన డాక్టర్ కేఏ పాల్, దేశ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేశారు. గత 37 ఏళ్లలో చైనా సాధించిన ప్రగతిని, భారత్ ప్రస్తుత స్థితిని పోలుస్తూ అభివృద్ధి మంత్రం పఠించారు. మతపరమైన రాజకీయాలు పక్కన పెట్టి, దేశాన్ని నంబర్ వన్ స్థానంలో నిలబెట్టడానికి అందరూ కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. 1989లో తాను అమెరికా వెళ్లిన నాటి పరిస్థితులను కేఏ పాల్ గుర్తుచేసుకున్నారు. అప్పట్లో భారత్, చైనాల జీడీపీ సమానంగా ఉండేవని.. కానీ నేడు చైనా 21-22 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచ అగ్రగామిగా ఎదుగుతుంటే, భారత్ కేవలం 3 ట్రిలియన్ డాలర్ల వద్దే ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. "చైనా ఆ 37 ఏళ్లలో ప్రపంచానికే నంబర్ వన్ ఎలా అయింది? మనం ఎందుకు వెనుకబడ్డాం?" అని ఆయన ప్రశ్నించారు. ప్రజలను కులమతాల పేరుతో రెచ్చగొట్టడం వల్లే అభివృద్ధి కుంటుపడుతోందని విమర్శించారు.

### లడ్డూ వివాదంపై పవన్ కల్యాణ్‌కు హితవు

తిరుమల లడ్డూ వివాదంపై స్పందిస్తూ, తాను ముందుగా చెప్పినట్లుగానే అక్కడ ఎలాంటి కల్తీ జరగలేదని పాల్ పునరుద్ఘాటించారు. "లడ్డూ పేరుతో హిందూ, ముస్లిం, క్రైస్తవులను రెచ్చగొడుతున్నారు. పవన్ కల్యాణ్ తమ్ముడు.. లడ్డూ కోసం అంతలా ఊగిపోవడం అవసరమా? ఇప్పటికైనా ప్రభువు మార్గంలో, శాంతి మార్గంలో, సత్య మార్గంలో నడువు" అంటూ ఏపీ ఉపముఖ్యమంత్రికి సలహా ఇచ్చారు. పనికిమాలిన చేష్టలు మాని, దేశాభివృద్ధి కోసం పని చేయాలని కోరారు. ప్రజా సమస్యలే అజెండా కావాలి ప్రజాప్రతినిధులు చిల్లర డిబెట్లు విడిచిపెట్టి నిరుద్యోగం, రైతు సమస్యలు, పేదరికం వంటి వాస్తవ సమస్యలపై దృష్టి పెట్టాలని పాల్ సూచించారు. "న్యాయ వ్యవస్థ ప్రభావితమవుతోంది, సత్యాన్ని చెప్పడానికి మీడియా భయపడుతోంది. ఇలాగే కొనసాగితే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలి ఇండియా సర్వనాశనం అవుతుంది" అని హెచ్చరించారు. ప్రపంచ శాంతి కోసం భారత్ ప్రయాణం చేయాలని, యుద్ధాలను విడిచిపెట్టాలని పిలుపునిచ్చారు.

### ఫిబ్రవరి 22న చెన్నైలో 'ప్రపంచ శాంతి సభ'

భారతీయులు చైనీయుల కంటే తెలివైన వారని ప్రపంచమే ఒప్పుకుంటుందని, మన తెలివితేటలను దేశ నిర్మాణానికి వాడాలని కేఏ పాల్ అన్నారు. అమెరికాతో కలిసి తప్పుడు మార్గంలో వెళ్లకుండా, భారత్‌ను నంబర్ వన్ దేశంగా మార్చడమే తన లక్ష్యమని ప్రకటించారు. ఈ క్రమంలోనే ఫిబ్రవరి 22 (ఆదివారం) నాడు చెన్నైలో భారీ ఎత్తున 'ప్రపంచ శాంతి సభ' నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమాజాన్ని కాపాడుకోవడానికి అందరూ కలిసి రావాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## చిక్కినట్టే చిక్కి.. తప్పించుకున్న పులి



**కొయ్యలగూడెం, జనవరి 26:** ఏలూరు జిల్లా ఏజెన్సీవాసులను ఇంకా పులి భయం వీడలేదు. ఆదివారం కొయ్యలగూడెం మండలం డిప్పకాయలపాడులోని ఒక రైతుకు చెందిన మొక్కజొన్న తోటలో పులి తిష్ఠ వేసిన విషయం విదితమే. దాని కదలికలను పరిశీలించేందుకు అటవీ అధికారులు తోట చుట్టూ ట్రాప్ కెమెరాలను అమర్చారు. దాన్ని బంధించేందుకు నలువైపులా బోన్లు సిద్ధం చేశారు. దీంతో పులి దాదాపు చిక్కినట్టేనని అంతా భావించారు. అయితే సోమవారం సాయంత్రం వరకు మొక్కజొన్న తోటలోనే ఉన్న పులి ఆపై బిల్లిమిల్లి, మర్రిగూడెం గ్రామాల వైపునకు వెళ్లినట్టు అడుగు జాడలను బట్టి సోమవారం ఉదయం గుర్తించారు. ఆ ప్రాంతంలోని రైతులంతా తమ పశువులను ఇళ్లకు తరలించడంతో.. సోమవారం రాత్రి వరకు పులి నుంచి ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. డ్రోన్ కెమెరాలతో దాని ఆచూకీ కనిపెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

## ఉపమాక ఆలయాన్ని సందర్శించిన అనిత

### అన్ని విధాలా అభివృద్ధికి సహకరిస్తామని వెల్లడి

**అనకాపల్లి, జనవరి 26:** జిల్లాలోని ఉపమాక ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. సోమవారం ఉపమాక ఆలయాన్ని సందర్శించిన ఆమె.. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో మంత్రికి అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు ఆమెకు ఆశీర్వచనమిచ్చారు. స్వామివారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను మంత్రికి అందజేశారు. స్వామివారి వార్షిక కల్యాణ నేపథ్యంలో.. ఆలయ వద్ద అధికారులతో హోంమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలిచ్చిన ఆమె.. వారంతా సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. ఫిబ్రవరి 27న ఉపమాక వేంకటేశ్వర స్వామివారి వార్షిక కళ్యాణం జరుగుతుందని తెలిపారు. ఆలయానికి రూ. 6 కోట్ల నిధులు మంజూరు చేశామని వెల్లడించారు. స్వామివారి వార్షిక కల్యాణం కూడా అత్యంత వైభవంగా నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అనిత పేర్కొన్నారు.



# బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదకరం

- రాజ్యాంగ హక్కులను కాషాయ సర్కార్ కాలరాస్తోంది
- హిందుత్వ ఎజెండాతో దేశాన్ని విభజిస్తున్నారని విమర్శ
- ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్
- ఎంఐఎం కార్యాలయం 'దారుస్సలాం'లో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు

**సమయం న్యూస్, కరీంనగర్:** భారతీయ జనతా పార్టీ దేశంలో అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు అత్యంత ప్రమాదకరమని ఎంఐఎం పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని ఎంఐఎం కార్యాలయం 'దారుస్సలాం'లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాడు బ్రిటిష్ ప్రభుత్వ పాలనలో, నేడు సంఘ్ పరివార్‌ఉబీజేపీ ప్రభుత్వ పాలనలో దేశం బందీగా మారిందని తీవ్ర విమర్శలు చేశారు. "విభజించి పాలించు" అనే సిద్ధాంతాన్ని అనుసరిస్తూ దేశ ప్రజలను కులాలు, మతాల పేరుతో బీజేపీ ప్రభుత్వం చీల్చి వేస్తోందని ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి మహనీయులు రూపొందించిన భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, సంఘ్ పరివార్ తన స్వంత అజెండాను దేశంపై రుద్దేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని అన్నారు. అమరుల త్యాగాల ఫలితంగా సాధించిన స్వాతంత్ర్యాన్ని, ప్రజలకు రాజ్యాంగ హక్కులు కల్పించిన గణతంత్ర వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని దుయ్యబట్టారు. గణతంత్రం సిద్ధించి 77 ఏళ్లు గడిచినా దళితులు, ముస్లింలు ఇప్పటికీ దేశంలో స్వేచ్ఛగా జీవించే పరిస్థితి లేదని అన్నారు. ధరించే దుస్తులు, తినే ఆహారం, దేవాలయ ప్రవేశం వంటి అంశాల్లో దళితులు, అణగారిన వర్గాలు ఎన్నో ఆంక్షలు, అణిచివేతలను ఎదుర్కొంటున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ దేశాన్ని హిందుత్వ కేంద్రంగా మార్చాలని బీజేపీ ప్రయత్నిస్తోందా? అని ప్రశ్నించారు. దేశంలో దళితులు, ముస్లింలపై సాంస్కృతిక దాడులు జరుగుతున్నాయని, బీజేపీ కుట్రలను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీతో పాటు నాయకులు బర్కత్ అలీ, ఆతిన, ఇబ్రహీం, ఫిరోజ్ అఖిల్, శర్ఫుద్దీన్, అలీబాబా, అజర్, ఆరిఫ్ అహ్మద్, మాజిద్ హుస్సేన్, బాబుజానీ, సాజిద్, మజారోద్దీన్, కాజం ఖాన్, తాజుద్దీన్, అంజద్ ఖాన్, ఇస్మాయిల్, షబ్బీర్, నిజాం, షాకిర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ డిజి స్కూల్‌లో ఘనంగా రిపబ్లిక్ డే

## 150 ఏళ్ల వందేమాతరం సందర్భంగా విద్యార్థులకు పోటీలు





**సమయం న్యూస్, కరీంనగర్:** స్థానిక అశోక నగర్‌లోని ఎస్ఆర్ డిజి స్కూల్‌లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ గీతాన్ని ఆలపించారు. వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు ప్రత్యేకంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తిని చాటారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ స్కూల్స్ జోనల్ ఇన్‌చార్జ్ తిరుపతి మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం ప్రాముఖ్యతను, భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులు, బాధ్యతలను విద్యార్థులకు వివరించారు. చిన్నతనం నుండే దేశభక్తిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్ మానస మాట్లాడుతూ.. "వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చింది. అటువంటి గొప్ప గీతం ప్రత్యేకతను నేటి తరానికి వివరించడం గర్వంగా ఉంది" అని పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆమె ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# అశోక్‌నగర్‌లో గణతంత్ర దినోత్సవం

**సమయం న్యూస్, కరీంనగర్:** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను కరీంనగర్‌లోని 54వ డివిజన్‌అశోక్‌నగర్‌లో టీడీపీ కరీంనగర్‌పార్లమెంట్‌ప్రధాన కార్యదర్శి తీగుట్ల రమేష్‌కుమార్‌ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ ప్రధాన కూడలి వద్ద జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. అంతకు ముందు మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, తొవిటి శంకరయ్య, జీవీ ఉమారాణిఉరమణ, నాంపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్, ఎంఐఎం నాయకుడు ఆసిమ్, బీఆర్‌ఎస్‌నాయకుడు ఎండీ యూసుఫ్, డివిజన్ యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.






# పద్మావతి అమ్మవారికి 'పుట్టింటి సారె'

## కరీంనగర్ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వైభవోపేత కార్యక్రమం

**సమయం న్యూస్, కరీంనగర్:** కరీంనగర్ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని, పద్మశాలి ఆడబిడ్డ అయిన పద్మావతి అమ్మవారికి సోమవారం ఘనంగా పుట్టింటి సారెను సమర్పించారు. పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు గడ్డం శ్రీరాములు గారి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పద్మశాలి కులబాంధవులు కుటుంబ సమేతంగా సాంప్రదాయ దుస్తులు ధరించి, శోభాయాత్రగా తరలివచ్చారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, మంగళప్రదమైన సారెను భక్తిశ్రద్ధలతో అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ "తిరుచానూర్ (తిరుపతి)లో పద్మావతి అమ్మవారికి అధికారికంగా సారె సమర్పించే ఆనవాయితీని స్ఫూర్తిగా తీసుకుని, కరీంనగర్‌లో కూడా ఏటా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం. వేంకటేశ్వర స్వామి వారి కల్యాణానికి ముందు రోజు అమ్మవారికి పుట్టింటి కానుకలు సమర్పించడం మా అదృష్టంగా భావిస్తున్నాం" అని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు మెతుకు సత్యం, గౌరవ అధ్యక్షుడు వాసాల రమేష్, పోపా జిల్లా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ, దేవసాని పాపన్న, మోర రాజేశం, అల్స భద్రన్న, జిల్లా యువజన సంఘం అధ్యక్షులు గుడిమల్ల శ్రీకాంత్, పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి వంగర ఆంజనేయులు, కోశాధికారి గజవెల్లి కనకయ్య, ఉపాధ్యక్షులు తెల్ల చంద్రశేఖర్, ఎలిగేటి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు వడ్డేపల్లి జ్యోతి, ఉషకోయిల సుజాత, బొల్లి రవి, పొరండ్ల రమేష్, నల్ల శ్రీధర్, మాసం సుధాకర్, బొల్లబత్తిని రవీందర్ మరియు పెద్ద సంఖ్యలో కులబాంధవులు పాల్గొన్నారు.

# పాఠశాలకు వాటర్ కూలర్ బహూకరణ



**సమయం న్యూస్, కరీంనగర్:** కరీంనగర్ లోని ఖాన్‌పుర ప్రభు త్వ ఉర్దూ మీడియం పాఠశాలకు ఏఐఎం ఐఎం 31వ డివిజన్ యువ నాయకుడు షేక్ యెస్దాని గణతం త్ర దినోత్సవం సంద ర్భంగా సోమవారం వాటర్‌కూలర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా యెస్దా నిని హెచ్‌ఎంహెచ్‌ఎం సయ్యద్‌ముతహ రుద్దీన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉ ర్దూ ట్రైన్డ్‌టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సర్వర్‌షా బియాబని, అబ్దుల్ కరీం, సమీర్ , సయ్యద్‌ఇమ్రాన్, ముఫసిల్ తవక్కల్, డివిజన్ యువకులు, నాయకులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరుస చోరీల దొంగల రిమాండ్



**సమయం న్యూస్, బోథ్:** మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని పత్తి చేనుల్లో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల మేరకు దర్యాప్తు చేపట్టినట్లు బోథ్ సీఐ డి గురుస్వామి సోమవారం తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు గ్యాంగ్‌గా ఏర్పడి పగటిపూట రెక్కీ నిర్వహించి, రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. అరెస్టు అయిన నిందితులు సుంకరి చిలకయ్య, ఎస్కె నాసిర్, మామిడి శ్రీనివాస్, అశోక్, రాజారాప దత్తు, ఎస్కె షఫీ కాగా, వీరితో పాటు దొంగ సరుకును కొనుగోలు చేసిన అల్లం చెందర్‌ను కూడా అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు కౌఠ(బి) గ్రామ శివారులోని నాలుగు పత్తి చేనుల్లో దాదాపు 5 క్వింటాళ్ల పత్తిని దొంగతనం చేయడంతో పాటు, ఒక చేనులోని సోలార్ ప్యానెల్, బ్యాటరీలను కూడా చోరీ చేసినట్లు తేలిందన్నారు. దొంగిలించిన పత్తిని అల్లం చెందర్‌కు విక్రయించగా, అవి దొంగ పత్తి అని తెలిసినా తన బొలెరో మ్యాక్స్ వాహనం ద్వారా తరలించి విక్రయించినట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి 30 కిలోల దొంగిలించిన పత్తి, రూ.9,600 నగదు, బొలెరో మ్యాక్స్ వాహనం, సోలార్ ప్యానెల్, బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో బోథ్ ఎస్సై వి పురుషోత్తం, హెడ్ కానిస్టేబుల్ హాఫీజ్, కానిస్టేబుళ్లు రాహుల్, కళ్యాణ్, సంజీవ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.